# విశాల భారతి

తెలుగు దినపత్రిక

30-12-2025

www.vishalabharati.com
epaper.vishalabharati.com

మంగళవారం, హైదరాబాద్ సంపుటి:3 సంచిక: 360


## రక్షణ రంగానికి ఊతం

- రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన త్రివిధ దళాల సమావేశం
- రూ.79 వేల కోట్ల విలువైన ఆయుధ కొనుగోళ్లకు ఆమోదం
- ఆధునిక ఆయుధాలు, యాంటీ-డ్రోన్ వ్యవస్థలను అందిస్తుంది
- ఒక లోయిటర్ మునిషన్ వ్యవస్థను అందుకోబోతుంది
- ఇది శత్రు లక్ష్యాలపై కచ్చితమైన దాడులను చేస్తుంది
- స్పైస్-1000 మార్గదర్శక కిట్ కూడా రానుంది



**విశాలభారతి, నేషనల్:**

భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన సోమవారం జరిగిన రక్షణ సముపార్జన మండలి సమావేశంలో త్రివిధ దళాలకు సుమారు రూ.79 వేల కోట్ల విలువైన ఆయుధ కొనుగోళ్ల ప్రతిపాదనలకు ఆమోదం లభించింది. భారత ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన ఈ ఒప్పందం ఇప్పుడు సైన్యానికి ఆధునిక ఆయుధాలు, యాంటీడ్రోన్ వ్యవస్థలను అందిస్తుంది.

మిగతా 2లో..

## కేటీఆర్ అరెస్ట్ కాబోతున్నాడా?

- మున్సిపల్ ఎన్నికల వేళ కేటీఆర్‌ను అరెస్ట్ కాబోతున్నట్లు వార్తలు
- కేటీఆర్ మాటలు చూస్తుంటే ఏదో జరుగుతున్నట్టే కనిపిస్తోంది
- అరెస్ట్ చేస్తే మాత్రం అది రాజకీయంగా సంచలనమవుతుంది
- ఈ అరెస్ట్ వ్యవహారం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది
- నన్ను అరెస్ట్ చేసేందుకు కుట్రలు జరుగుతున్నాయని కేటీఆర్ అన్నారు
- కేటీఆర్ అరెస్ట్‌కు భయం ఏంటంటే ఫార్ములా ఈ రేసు కేసు

03



## తొలి రోజే రభస..!

- తెలంగాణ శాసనసభ సమావేశాలు హాట్ హాట్‌గా మొదలయ్యాయి
- అధికార కాంగ్రెస్ , ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధం జరిగింది
- ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు
- మేడిగడ్డ బ్యారేజీని, చెక్ డ్యాంను బాంబు పెట్టి పేల్చేశారని ఆరోపించారు
- ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా దెబ్బతీస్తోందని ఆరోపించారు
- కౌశిక్ రెడ్డి వ్యాఖ్యలను వెంటనే తొలగించాలని స్పీకర్‌ను డిమాండ్ చేశారు



**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

తెలంగాణ శాసనసభ వేదికగా అధికార కాంగ్రెస్ , ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధం జరిగింది. హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు సభలో తీవ్ర గందరగోళానికి దారితీశాయి. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీని , ఒక చెక్ డ్యాంను బాంబులు పెట్టి పేల్చేశారంటూ ఆయన చేసిన ఆరోపణలు సభను ఉలిక్కిపడేలా చేశాయి. సభలో చర్చ జరుగుతున్న సమయంలో కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన నిర్మాణాలను ప్రస్తుత ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా దెబ్బతీస్తోందని ఆరోపించారు. మేడిగడ్డ తరహాలోనే తన నియోజకవర్గ పరిధిలోని తనుగుల చెక్‌డ్యాంను కూడా బాంబు పెట్టి పేల్చేశారని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. గత ప్రభుత్వానికి చెడ్డపేరు తేవడానికే ఇలా చేస్తున్నారని ఆయన మండిపడ్డారు.

మిగతా 2లో..

తెలంగాణలో అసెంబ్లీ శీతాకాల సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో అపోసిషన్ పార్టీ నేత కేసీఆర్ సభకు రావడం ప్రస్తుతం ఆసక్తి కరంగా మారింది. నిన్న ఎర్రవెల్లి ఫామ్ హౌస్ నుంచి కేసీఆర్ హైదరాబాద్‌లోని నందినగర్‌కు వచ్చారు. ఆ తర్వాత అసెంబ్లీ సోమవారం అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యారు. విపక్ష నేతగా కేసీఆర్‌తో పాటు కేటీఆర్, హరీశ్‌రావు తదితర బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సభకు హాజరయ్యారు. సమావేశాలు ప్రారంభమైన వెంటనే దివంగత రాంరెడ్డి దామోదర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొండా లక్ష్మారెడ్డికి సభ సంతాపం ప్రకటించింది. అనంతరం సభను వాయిదా వేశారు.

## కేసీఆర్ గారూ.. బాగున్నారా?

### తెలంగాణ అసెంబ్లీ శీతాకాల సమావేశాలు ప్రారంభమయ్యాయి

కేసీఆర్ సభకు రావడం ప్రస్తుతం
ఆసక్తి కరంగా మారింది
కేటీఆర్, హరీశ్‌రావు తదితర
బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హాజరయ్యారు
సీఎం రేవంత్ రెడ్డి కేసీఆర్ దగ్గరకు
వెళ్లి ఆరోగ్యంపై ఆరా తీశారు
దీనికి మాజీ సీఎం కేసీఆర్ కూడా
స్పందించి సమాధానం ఇచ్చారు
కేసీఆర్ ఆరోగ్యంపై ఆరాతీయడం
చర్చనీయాంశంగా మారింది



**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

సీఎం రేవంత్ రెడ్డి మాజీ సీఎం కేసీఆర్ దగ్గరకు వెళ్లి ఆయన ఆరోగ్యంపై ఆరా తీశారు. దీనికి గులాబీ బాస్ బాగున్నట్లు రిప్లై చెప్పారు. మొత్తంగా ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి పదే పదే తనను ఎప్పుడు సచ్చిపోతాడో అంటూ తూలనాడుతున్నాడంటూ కేసీఆర్ వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి మాజీ సీఎంను కేసీఆర్ ఆరోగ్యం పై ఆరాతీయడం చర్చనీయాంశంగా మారింది. సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీ హాల్లోకి రాగానే కేసీఆర్ దగ్గరికి వెళ్లి సీఎం రేవంత్ రెడ్డి కరచాలనం చేశారు. అదే విధంగా.. సీఎం తర్వాత కేసీఆర్ దగ్గరికి వెళ్లి కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు సైతం కరచాలనం చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. కేసీఆర్‌ను కలిసిన వారిలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు, కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, సీతక్క, వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభత్వ విప్ లు బీర్ల ఐలయ్య, ఆది శ్రీనివాస్ పలువురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, సీపీఐ ఎమ్మెల్యే కునమనేని సాంబశివరావు ఉన్నారు. అదే విధంగా.. నూతన ఎమ్మెల్యే నవీన్ యాదవ్ సైతం కేసీఆర్ గారిని కలిసి ఆశీర్వాదం తీసుకోవడం ఆసక్తికరంగా మారింది. అయితే.. అసెంబ్లీలో ప్రధానంగా సాగునీటి ప్రాజెక్టులు, ప్రజా సమస్యలే ప్రధాన ఎజెండాగా ప్రభుత్వాన్ని నిలదీసేందుకు బీఆర్ఎస్ సిద్ధమైంది.

మిగతా 2లో..



## జనవరి 7వరకు అసెంబ్లీ సమావేశాలు

స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అధ్యక్షతన బీఏసీ మావేశం
అసెంబ్లీ సమావేశాలపై బీఏసీ భేటీలో నిర్ణయం తీసుకున్నారు
జనవరి 2 నుంచి 7వ తేదీ వరకు నిర్వహించాలని నిర్ణయించారు
బీఏసీ సమావేశానికి ముఖ్య నాయకుకలు హాజరయ్యారు
జనవరి 7న మళ్లీ బీఏసీ సమావేశం ఉంటుందని తెలిపారు
15 రోజులు జరపాలని పట్టుపట్టామని హరీష్ రావు తెలిపారు

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

‘ శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అధ్యక్షతన బీఏసీ(బిజినెస్ అడ్వయిజరీ కమిటీ) సమావేశం జరిగింది. అసెంబ్లీ సమావేశాలపై బీఏసీ భేటీలో నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు జనవరి 2 నుంచి 7వ తేదీ వరకు నిర్వహించాలని నిర్ణయించారు. స్పీకర్ ఛాంబర్‌లో జరిగిన బీఏసీ సమావేశానికి ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్‌లు హాజరయ్యారు. మహేశ్వర్‌రెడ్డి, అక్బరుద్దీన్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. అసెంబ్లీ పనిదినాలు ఎజెండాను ఈ సమావేశంలో ఖరారు చేశారు. బీఏసీ సమావేశం ముగిసిన అనంతరం మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు మాట్లాడారు. అసెంబ్లీ సమావేశాలు 15 రోజులు జరపాలని పట్టుపట్టామని వివరించారు. వారం రోజులు జరిపి మళ్లీ బీఏసీ పెడతామన్న స్పీకర్ చెప్పారన్న హరీశ్‌రావు అసెంబ్లీలో పీపీటీ ఇచ్చేందుకు అవకాశం ఇవ్వాలని కోరామన్నారు. ఆలోచించి నిర్ణయం తీసుకుంటారని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారని ఆయన వివరించారు. గతంలో కాంగ్రెస్‌కు అవకాశం ఇవ్వనందుకు బహిష్కరించామని భట్టి విక్రమార్క అన్నారని హరీశ్ గుర్తుచేశారు. ఇప్పుడు మీరు (కాంగ్రెస్ ప్రభుత్వం) ఇవ్వకపోతే మేము బాయ్‌కాట్ చేయాలా అని అడిగామన్నారు. బీజేపీ శాసనసభా పక్షనేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ శాసన

మిగతా 2లో..

## ఉత్తమ్‌కు సీఎం రేవంత్ గాలి సోకింది

- హరీష్ రావు ఉత్తమ్ కుమార్ రెడ్డిపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు
- ఉత్తమ్‌కు సీఎం రేవంత్ రెడ్డి సావాస దోషం పట్టిందన్నారు
- అందుకే వాస్తవాలు దాచి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు
- కాంగ్రెస్ నేతలే అసలైన పాలమూరు ద్రోహులని మండిపడ్డారు
- తమహయాంలో ప్రాజెక్టు కోసం రాత్రింబవళ్లు పనిచేశామన్నారు
- రెండేళ్లు గడిచినా ఒక్క అనుమతి కూడా రాలేదని విమర్శించారు



**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు రాష్ట్ర ప్రభుత్వంపై, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. సోమవారం అసెంబ్లీ ఆవరణలో మీడియాతో జరిగిన చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ.. మంత్రి ఉత్తమ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సావాస దోషం పట్టిందని, అందుకే వాస్తవాలు దాచి ఉత్త మాటలు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును అడ్డుకునేందుకు గతంలో గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసులు వేసిన కాంగ్రెస్ నాయకులే అసలైన పాలమూరు ద్రోహులని ఆయన మండిపడ్డారు. తమ ప్రభుత్వ హయాంలో ఈ ప్రాజెక్టు కోసం రాత్రింబవళ్లు పనిచేసి, దాదాపు రూ. 4000 కోట్లు ఖర్చు పెట్టి ఆరున్నర లక్షల ఎకరాలకు నీరందించామని గుర్తు చేశారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక 90 టీఎంసీలుగా ఉన్న ప్రాజెక్టు సామర్థ్యాన్ని 45 టీఎంసీలకు తగ్గించిందని ఆరోపించారు. డీపీఆర్ వెనక్కి వచ్చి ఏడాది గడుస్తున్నా.. దాన్ని సవరించి పంపడంలో

మిగతా 3లో..

## అటాకింగ్ మూడ్‌లోకి వెళ్లాలి

సీఎం రేవంత్ రెడ్డి మంత్రులతో అత్యవసర సమావేశం

అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలోమంత్రులకు దిశానిర్దేశం
బీఆర్ఎస్ తన ఉనికిని కాపాడుకునే ప్రయత్నాల్లో ఉందన్నారు
వారు చేసే విమర్శలను సమర్థవంతంగా తిప్పికొట్టాలని తెలిపారు
నీటి వాటాల విషయంలో చాలా అప్రమత్తంగా ఉండాలన్నారు
గత ప్రభుత్వం చేసిన తప్పులను ఎండగట్టాలని పిలుపునిచ్చారు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** సీఎం రేవంత్ రెడ్డి సోమవారం తన మంత్రులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో అనుసరించాల్సిన వ్యూహాలపై మంత్రులకు దిశానిర్దేశం చేసిన సీఎం, రాజకీయంగా కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రధానంగా ప్రతిపక్ష పార్టీ అయిన బీఆర్ఎస్ ప్రస్తుతం తన ఉనికిని కాపాడుకునే ప్రయత్నాల్లో ఉందని.. ఈ తరుణంలో ప్రభుత్వంపై వారు చేసే విమర్శలను సమర్థవంతంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

మిగతా 2లో..

## అంత అహంకారం ఎందుకు?

- బీఆర్ఎస్ గోబెల్స్ ప్రచారం చేస్తుందని మంత్రి ఉత్తమ్ విమర్శించారు
- పాలమూరు రంగారెడ్డికి 90టీఎంసీలే ప్రభుత్వ విధానమన్నారు
- ఇరిగేషన్‌లోమాస్టర్‌నని హరీష్ రావు అనుకుంటున్నారన్నారు
- హరీష్ పదేపదే అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు

02



# అంత అహంకారం ఎందుకు?

- బీఆర్ఎస్ గోబెల్స్ ప్రచారం చేస్తుందని మంత్రి ఉత్తమ్ విమర్శించారు
- పాలమూరు రంగారెడ్డికి 90టీఎంసీలే ప్రభుత్వ విధానమన్నారు
- ఇరిగేషన్‌లోమాస్టర్‌నని హరీష్ రావు అనుకుంటున్నారన్నారు
- హరీష్ పదేపదే అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు
- ఎవరి హయాంలో ఏం జరిగిందో బయటపెడతామని స్పష్టం చేశారు
- కృష్ణా బేసిన్‌పై అసెంబ్లీలో ప్రెజెంటేషన్‌కు సిద్ధమని తెలిపారు



**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతలకు 90టీఎంసీల కేటాయింపునే మా ప్రభుత్వ విధానమని, మేం 45టీఎంసీలకు ఒప్పుకుంటూ కేంద్రానికి లేఖ రాశామని బీఆర్ఎస్ గోబెల్స్ ప్రచారం చేస్తుందని రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. సోమవారం మీడియా చిట్ చాట్ లో ఆయన మాట్లాడారు. నీటి లెక్కలన్ని తనకే తెలుసన్నట్లుగా ఇరిగేషన్‌లో తానే మాస్టర్‌నని హరీష్ రావు అనుకుంటున్నారని విమర్శించారు. హరీశ్‌రావుకు అంత అహంకారం ఎందుకు? అని ప్రశ్నించారు. పదేపదే అబద్ధాలు చెబుతూ గోబెల్స్ కు తాతగా వ్యవహరిస్తున్నాడని విమర్శించారు. పాలమూరు రంగారెడ్డికి ప్రభుత్వం డిమాండ్ 90 టీఎంసీలే అని, 45 టీఎంసీలు అనేది బీఆర్ఎస్ పార్టీ ప్రచారం చేస్తోందని ఉత్తమ్ ఆరోపించారు. 45 టీఎంసీ మైనర్ ఇరిగేషన్, 45 టీఎంసీ గోదావరి డైవర్షన్ అని వాళ్లు ఇచ్చిన జీవో నే.. మేము ప్రస్తావిస్తూ..లేఖ రాశాం అన్నారు. మొదటగా మా సేవింగ్ ఉన్న.. 45 టీఎంసీ ల మైనర్ ఇరిగేషన్ ను క్లియర్ చేయమని అడిగాం అని స్పష్టం చేశారు. పేజ్ 1 లో ఇనిషియల్ గా చేయమని అడిగాం అన్నారు. బీఆర్ఎస్ నేతలు.. సుప్రీం కోర్టు లో 7 టీఎంసీ లకు ఒప్పుకొని వచ్చారని ఆరోపించారు.

ఎవరి హయాంలో ఏం జరిగిందో అంతా శాసన సభ చర్చలో బయటపెడతామని మంత్రి ఉత్తమ్ స్పష్టం చేశారు. అబద్ధాల పునాదులపై బీఆర్ఎస్ బతుకుతోందని ఎద్దేవా చేశారు. ఒక అబద్ధాన్ని పదే పదే చెబుతూ.. అదే నిజం అవుతుందనుకుంటున్నారని మండిడ్డారు. సీడబ్ల్యూకి రాసిన లేఖలో ఓ పేరాగ్రాఫ్‌ను అవుటాఫ్ కాంటెక్స్ట్ తీసుకొస్తున్నారని చెప్పుకొచ్చారు. తెలంగాణకు అన్యాయం జరిగేలా తానెందుకు లేఖ రాస్తా? అని ప్రశ్నించారు. సీడబ్ల్యూసీకి రాసిన లేఖలో ఒక భాగాన్నే చూపిస్తున్నారని.. కృష్ణా బేసిన్‌పై అసెంబ్లీలో ప్రెజెంటేషన్‌కు తాము సిద్ధమని స్పష్టం చేశారు. మీరు పదేళ్లలో పాలమూరు ఎత్తిపోతల ప్రాజెక్టు పూర్తి చేయలేకపోయారు. మేము మాత్రం పూర్తి చేసి పాలమూరు ప్రాంతానికి నీరు అందిస్తాం అన్నారు. మీ చేతకాని తనాన్ని మాపై రుద్దవద్దు అని, మసిపూసి మారేడుకాయ చేసి ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారన్నారు. ప్రాజెక్టు డీపీఆర్ కేంద్రానికి పంపడానికి 7 ఏళ్ళు టైం తీసుకున్నారు. డీపీఆర్ పంపే టైం కు 21 వేల కోట్లు ఖర్చు చేశారు అని, పాలమూరురంగారెడ్డిలో పదేళ్ల కాలంలో 21 వేల కోట్ల పనులు మాత్రమే చేశారని విమర్శించారు. సీడబ్ల్యూసీకి డీపీఆర్ పంపే టైంకు 65 వేల కోట్ల అంచనా పేర్కొన్నారని, మొదట్లో 35 వేల కోట్ల అంచనాతో ప్రాజెక్టు స్టార్ట్ చేశారని గుర్తు చేశారు. బీఆర్ఎస్ అధికారం నుంచి దిగి పోయే టైం కు 27 వేల కోట్లు ఖర్చు చేశారు. 65 వేల కోట్లకు 27 మాత్రమే ఖర్చు చేశారని ఉత్తమ్ వెల్లడించారు. ఆయకట్టు కాల్వలకు భూసేకరణ చేయాలంటే మొత్తం కలిపి 70 వేల కోట్లు అవుతుందన్నారు. 35 శాతం ఖర్చు చేసి.. 80 శాతం చేశామని చెప్పుకోవడం సిగ్గుచేటు అన్నారు. మేము రెండేళ్లలో 7 వేల కోట్లు ఖర్చు చేశాం అని ఉత్తమ్ తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో ఒక్కటే పంపు పెడితే.. మేము వచ్చాక 11 మోటర్లు పెట్టాం అని వెల్లడించారు. పెండింగ్ పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పనులకు రూ.27 వేల కోట్లు.. కొత్త కాళేశ్వరంకు లక్ష కోట్లు ఖర్చు చేశారని..మీకు పాలమూరు మీద ఎందుకు అంత వివక్ష అని ఉత్తమ్ బీఆర్ఎస్ ను నిలదీశారు. పాలమూరురంగా రెడ్డికి వ్యతిరేకంగా పనిచేశారని విమర్శించారు. పాలమూరు ప్రాజెక్టును రెండు టీఎంసీల నుంచి ఒక్క టీఎంసీకి కుదించారు అని, కాళేశ్వరం ప్రాజెక్టు రెండు టీఎంసీల నుంచి.. మూడు టీఎంసీలకు పెంచారు అని ఉత్తమ్ తెలిపారు. సీఈ విజయ్ భాస్కర్ రెడ్డికి స్వయంగా.. పాలమూరు పనులు స్లో చేయాలని చెప్పారని ఉత్తమ్ ఆరోపించారు. ఇరిగేషన్ మీద 1.83 లక్షల కోట్లు ఖర్చు చేశారు. కానీ పాలమూరులోని పెండింగ్ లో ఉన్న నెట్టెంపాడు, కల్వకుర్తి, భీమా పెండింగ్ లోనే ఉన్నాయన్నారు. ట్రిబ్యునల్ తీర్పు వచ్చే వరకు కృష్ణాలో 299 టీఎంసీ లకు కట్టుబడి ఉంటామని ఆపెక్స్ కౌన్సిల్ లో ఒప్పుకున్నారన్నారు. పాలమూరు ప్రాజెక్టు పరిధిలోని నార్లపూర్, ఎదుల లింక్ పనులు కూడా ఆపేశారని ఉత్తమ్ ఆరోపించారు. 2 వేల కోట్ల తో ఖర్చు చేస్తే పూర్తి అయ్యే ఎస్ఎల్బీసీ విషయంలోనూ నిర్లక్ష్యం చేశారు అని మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు లక్ష కోట్లు ఖర్చు చేసి.. పాలమూరు జిల్లా ప్రాజెక్టులకు కు మాత్రం మొండి చేయి చూపారు అని, కల్వకుర్తి 900 కోట్లు ఖర్చు చేస్తే పూర్తి అయ్యేదని.. కానీ చేయలేదు అని విమర్శించారు. మేడిగడ్డ పునర్నిర్మాణంపై ఎల్ అండ్ టీ సంస్థకు నోటీసులు ఇచ్చాం అని, పలు టెస్టులు, ఇతర అంశాలకు సంస్థ ఒప్పుకుందని, త్వరలోనే పనులు మొదలు అవుతాయని తెలిపారు. మేడిగడ్డ పునర్నిర్మాణం పనులకు డెడ్‌లైన్ పెట్టామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

# కేసీఆర్ గారూ.. బాగున్నారా?

( మొదటిపేజీ తరువాయి )



మరోవైపు సీఎం రేవంత్ రెడ్డి సర్కారు కూడా బీఆర్ఎస్ ప్రశ్నలకు ఎన్ కౌంటర్ చేసేందుకు అన్ని విధాలుగా అస్త్రశస్త్రలతో రెడీగా ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు పెండింగ్ బిల్లులు చెల్లించాలని మాజీ సర్పంచ్‌లు అసెంబ్లీకి ముట్టడికి ప్రయత్నించారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు వారిని అడ్డుకుని, పలువురిని అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో మాజీ ఎమ్మెల్యే తోపులాటలో కింద పడిపోయారు. మరోవైపు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరక్కుండా పోలీసులు మూడంచెల వ్యవస్థలో పటిష్టమైన బందో బస్తు చేపట్టారు. చివరకు అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకం చేసిన తర్వాత సభ నుంచి బయటకు వెళ్లిపోయారు కేసీఆర్. కేసీఆర్ వద్దకు సీఎం రేవంత్‌రెడ్డి వస్తుండడంతో సభలో సభ్యులు గౌరవం ఇవ్వాలి. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కొందరు లేచి నిలబడగా, మరో ఇద్దరు ఎమ్మెల్యేలు అమర్యాదగా కూర్చుని ఉన్న వైనం బయటపడింది. వారిలో ఒకరు మాజీ మంత్రి సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్, మరొకరు హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి. ఇద్దరు సభ్యులు సీట్లలో కూర్చున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. స్వయంగా ముఖ్యమంత్రి తన పదవిని పక్కన పెట్టి కేసీఆర్ బాగోగులు అడిగి తెలుసుకుంటే, ఆయన కొడుకు సభ మర్యాదని పాటించలేదంటూ ఫైర్ అవుతున్నారు కాంగ్రెస్ నాయకులు. ఇదేనా సభ మర్యాద అంటూ ట్రోల్ చేస్తున్నారు నెటిజన్స్. సభ నుంచి నేరుగా తన ఛాంబర్‌కి వెళ్లిపోయారు మాజీ సీఎం. ప్రతిపక్షంలో కూర్చోవడం ఇష్టంలేక కేసీఆర్ పోయినట్టు తెలుస్తోంది. ఇటీవల మరణించిన దివంగత సభ్యులు రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, కొండా లక్ష్మణ్‌రెడ్డికి సంతాపం తెలిపింది అసెంబ్లీ. సభలో కీలక పత్రాలు ప్రవేశపెట్టింది. ఆ తర్వాత అసెంబ్లీ సమావేశాలు కొనసాగాయి. చెక్ డ్యామ్‌లను బాంబులు పెట్టి పేల్చారన్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి వ్యాఖ్యలపై ఎమ్మెల్యే నాగరాజు కౌంటర్ ఇచ్చారు. సభలో ఇలాంటి అసత్య ప్రచారాలు చేయడం నిజంగా సిగ్గు చేటని అన్నారు. సదరు ఎమ్మెల్యే వ్యాఖ్యల్ని రికార్డుల్లో నుంచి తొలగించాలన్నారు. సభ్యలో సభ్యులు సరైన భాష మాట్లాడాలని సూచన చేశారు. అటు నియోజకవర్గంలో పలు సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్. మరోవైపు తెలంగాణ శాసనమండలి ప్రారంభమైన కొద్దిసేపటికి వాయిదా పడింది. జనవరి 2కు సమావేశాలను వాయిదా వేసినట్లు మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ప్రకటించారు. ఈ సభలో ప్రధానంగా కృష్ణా, గోదావరి నదీ జలాలపై వాడీవేడి చర్చ జరిగే అవకాశం కనిపిస్తోంది. పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకం డీపీఆర్వ్యవహారం ప్రస్తుతం అధికార, ప్రతిపక్షాల మధ్య చిచ్చు పెట్టింది. ఈ పథకానికి కేవలం 45 టీఎంసీల కేటాయింపులు మాత్రమే కోరడం తెలంగాణకు నష్టమని భారాస ఆరోపిస్తుండగా.. తాము మొత్తం 90 టీఎంసీల కోటా కోసం ప్రయత్నిస్తూనే, తక్షణ అనుమతుల కోసం 45 టీఎంసీల ప్రతిపాదన పెట్టామని ప్రభుత్వం కౌంటర్ ఇస్తోంది.

# అటాకింగ్ మూడ్‌లోకి వెళ్లాలి

( మొదటిపేజీ తరువాయి )

రాష్ట్ర ప్రయోజనాలకు అత్యంత కీలకమైన నీటి వాటాల విషయంలో మంత్రులందరూ చాలా అప్రమత్తంగా ఉండాలని సీఎం ఆదేశించారు. కృష్ణా, గోదావరి జలాల విషయంలో గత ప్రభుత్వం చేసిన తప్పులను ఎండగడుతూనే.. ప్రస్తుత ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను స్పష్టంగా వివరించాలని సూచించారు. సభలో మంత్రుల అటెండెన్స్ విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని, ప్రతి అంశంపై పూర్తి అవగాహనతో సిద్ధంగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు.



సభలో ప్రతిపక్షాల విమర్శలకు కౌంటర్ ఇచ్చేందుకు మంత్రులు సిద్ధంగా ఉండాలని రేవంత్ రెడ్డి సూచించారు. ముఖ్యంగా జిల్లాల వారీగా పెండింగ్‌లో ఉన్న సమస్యలు, గత ప్రభుత్వ వైఫల్యాలపై మంత్రులు అటాకింగ్ మూడ్‌లోకి వెళ్లాలని ఆదేశించారు. 'పాయింట్ ఆఫ్ ఆర్డర్' వంటి సభా నియమాలను ఉపయోగించుకుంటూ.. ప్రతిపక్షం అడిగే ప్రతి ప్రశ్నకూ సమాధానం ఇవ్వడమే కాకుండా.. వారు చేస్తున్న అసత్య ప్రచారాలను తిప్పికొట్టాలని చెప్పారు. అసెంబ్లీ సమావేశాల పొడిగింపు లేదా తదుపరి కార్యాచరణపై చర్చించేందుకు ఈ నెల 4వ తేదీన మళ్ళీ బిజినెస్ అడ్వైజరీ కమిటీ సమావేశం నిర్వహిస్తామని ముఖ్యమంత్రి వెల్లడించారు. ఈ లోపు మంత్రులు తమ తమ శాఖలపై పూర్తి సమాచారంతో ఉండాలని, ప్రజల్లోకి ప్రభుత్వ సందేశాన్ని బలంగా తీసుకెళ్లాలని ఆయన దిశానిర్దేశం చేశారు.

అయితే ఇప్పుడు తెలంగాణ అసెంబ్లీ సమావేశాల్లో కేసీఆర్‌రేవంత్ కరచలనం.. పలకరింపుపై ఆసక్తికర చర్చ నడుస్తోంది. అయితే.. కేసీఆర్‌ను తాను ముఖ్యమంత్రి హోదాలో కలవడం ఇదే తొలిసారేం కాదు కదా అని రేవంత్ అంటున్నారు. అసెంబ్లీ ఆవరణలో ఆయన మీడియా చిట్ చాట్‌లో ఈ అంశంపై స్పందించారు. "కేసీఆర్‌ను నేను సీఎం హోదాలో కలవడం ఇదే తొలిసారేం కాదు. గతంలో ఆస్పత్రిలోనూ కలిశాను కదా. నేను సభా నాయకుడ్ని. కాబట్టి అందరినీ గౌరవిస్తా. అందుకే కేసీఆర్‌ను పలకరించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నా. మరి సభలో నుంచి వెంటనే ఎందుకు వెళ్లిపోయారో ఆయన్నే అడగాలి'' అని రేవంత్ అన్నారు.

శీతాకాల సమావేశాల్లో భాగంగా.. తొలిరోజు అసెంబ్లీకి వచ్చిన కేసీఆర్ అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకం చేసి వెళ్లిపోయారు. అయితే ఆయన వెళ్లే లోపు సభలో సీఎం రేవంత్, ప్రభుత్వం విప్‌లు, మంత్రులు, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ సైతం కేసీఆర్ దగ్గకు వెళ్లి పలకరించి ఆరోగ్యంపై ఆరా తీశారు. ఆ సమయంలో కేటీఆర్, పాడి కౌశిక్‌రెడ్డి మినహా మిగతా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు లేచి నిలబడ్డారు. రాకరాక సభకు వచ్చిన కేసీఆర్ కొద్దిసేపైనా సభలో ఉంటారనుకున్నామని మంత్రి కోమటిరెడ్డి తెలిపారు. కేసీఆర్ ఆరోగ్యం ఎలా ఉంది అని అడిగా... బావుంది అని చెప్పారు. నా ఆరోగ్యం గురించి కూడా అడిగారు.. బావుందని చెప్పా. కేసీఆర్ హాస్పిటల్ లో దీక్ష చేశారు. నేను రోడ్లపై దీక్ష చేశాను. నేను ఒరిజినల్ ఉద్యమకారుడిని. తెలంగాణ కోసం పోరాడిన మాజీ శాసన సభ్యుల సంతాప తీర్మానం చదివే సమయంలో కేసీఆర్ బయటకి వెళ్లారు. మౌనం పాటించిన తర్వాత కేసీఆర్ వెళ్తే బావుండేది అని కోమటిరెడ్డి అన్నారు. పెద్ద మనిషిగా కేసీఆర్ ను కలవడంలో తప్పు లేదు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే కేసీఆర్ ను కలిశారు. నేనూ కేసీఆర్‌ను కలవాలి అనుకున్నా. కానీ, ఆయన చుటటూ దుర్మార్గులు ఉన్నారు. అందుకే కలవలేదు అని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ అన్నారు. కృష్ణా జలాల్లో వాటాలు, ఒప్పందాలే లక్ష్యంగా ఈ సారి అసెంబ్లీ సమావేశాలు జరగనున్నాయి.జనవరి 2 నుంచి 7 వరకు సెషన్ నిర్వహించనున్నట్టు వెల్లడించింది. జనవరి 4న సెషన్ ఉండబోదని తెలుస్తోంది. కృష్ణాలోని 811 టీఎంసీల జలాల్లో ఏపీకి 12 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీలు చాలని సంతకం పెట్టి మన రాష్ట్రానికి మరణశాసనం రాసింది బీఆర్ఎస్ సర్కారు అని, అప్పటి సీఎం కేసీఆర్, నీళ్ల మంత్రి హరీశ్ అని ప్రభుత్వం ఆరోపిస్తోంది. బీఆర్ఎస్ మాత్రం పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి 45 టీఎంసీలు చాలని కేంద్రానికి లేఖ రాసిందని అంటోంది. 90 టీఎంసీల సాధన కోసం పనిచేయాలని డిమాండ్ చేస్తోంది. జలద్రోహం చేస్తున్నది కాంగ్రెస్ ప్రభుత్వమని ఆరోపిస్తోంది. ఈ అంశాలపై చర్చించేందుకు ప్రభుత్వం అసెంబ్లీని సమావేశ పర్చింది.

# జనవరి 7వరకు అసెంబ్లీ సమావేశాలు

( మొదటిపేజీ తరువాయి )

సభ సమావేశాలు కనీసం 20 రోజులైనా నిర్వహించాలని కోరామన్నారు. 32 అంశాలపై చర్చించాలని కోరినట్లుగా వివరించారు. జనవరి 2 నుంచి 7 వరకు సమావేశాలు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారని వివరించారు. జనవరి 7న మళ్లీ బీఏసీ సమావేశం ఉంటుందని తెలిపారు. 2 రోజులు సమావేశాలు పెట్టి చేతులు దులుపుకోవటం సరికాదని వివరించారు. "రాష్ట్రం అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతూ ఉంది. వాటిపై చర్చించే దమ్ము, ధైర్యం లేనటువంటి ప్రభుత్వం, మళ్లీ యథావిధిగా మూడు నాలుగు రోజుల్లో శీతాకాల సమావేశాలు ముగించేవిధంగా మాట్లాడుతున్నారు. కాళేశ్వరం, అనేక అంశాలపై దర్యాప్తు చేయించి బాధ్యులను జైల్లో పెడతానని హామీ ఇచ్చి కాలయాపన చేస్తున్నారు. ఎన్నికల ముందు బీసీ, ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ పేరుమీద అనేక హామీలు ఇచ్చారు. వాటిపై చర్చించే దమ్ము, ధైర్యం ప్రభుత్వానికి ఉందా అని ప్రశ్నిస్తున్నా. ఇచ్చిన హామీలపై అసెంబ్లీలో చర్చించేందుకు సమయం కూడా ఇవ్వడం లేదు. కాంగ్రెస్ ప్రధాన ప్రతిపక్షంతో మ్యాచ్‌ఫిక్సింగ్‌కు ప్రయత్నిస్తోంది. అసెంబ్లీలో అన్ని అంశాలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు



తొలి రోజు శాసనసభ సమావేశాల సందర్భంగా దివంగత మాజీ ఎమ్మెల్యేలు రాంరెడ్డి దామోదర్ రెడ్డి, కొండా లక్ష్మారెడ్డిలకు సంతాప తీర్మానాలను శాసనసభ స్పీకర్ సభలో ప్రవేశపెట్టారు. అనంతరం సభ్యులందరూ సంతాపాన్ని తెలిపారు. ఈ సమావేశాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రతిపక్ష నేత, మాజీ సీఎం కేసీఆర్‌తో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేసీఆర్ వద్దకు సీఎం రేవంత్‌రెడ్డి వెళ్లి బాగున్నారా? అని పలకరించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్, సీతక్క, కోమటిరెడ్డి ఆయనను పలకరించి గౌరవ సూచకంగా అభివాదం చేశారు. సంతాప తీర్మానాల అనంతరం కేసీఆర్ సభ నుంచి నందినగర్‌లోని ఇంటికి సభకు మంత్రులు తప్పనిసరిగా హాజరుకావాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. బీఆర్ఎస్ ఉనికిని కాపాడుకునే పనిలో ఉందని అన్నారు. ప్రతిపక్షాలకు కౌంటర్ ఇచ్చేందుకు అమాత్యులు సిద్ధంగా ఉండాలన్నారు. సభలో పాయింట్ అఫ్ ఆర్డర్ ముఖ్యమన్న ఆయన ప్రతిపక్షం అడిగే ప్రతి అంశానికి సమాధానం ఇవ్వాలన్నారు. ఇదే సమయంలో మంత్రులతో సీఎం రేవంత్ రెడ్డి ఇవాళ అసెంబ్లీలో సమావేశమయ్యారు. సెషన్ ముగిసే వరకు ఎట్టి పరిస్థితిలోనూ అసెంబ్లీకి గైర్హాజరు కావద్దని సూచించారు. నీటి వాటాల విషయంలో మంత్రులు అందరూ అలర్ట్ ఉండాలని సూచించారు. బీఆర్ఎస్ ఉనికిని కాపాడుకొనే పనిలో ఉందన్నారు. ప్రతిప క్షాలకు కౌంటర్ ఇచ్చేందుకు అందరూ సిద్ధంగా ఉంటాలన్నారు. పాయింట్ ఆఫ్ ఆర్డర్ ముఖ్యమని, అవకాశం కోసం అందరూ ఎదురు చూడాలని సూచించారు. అడిగే ప్రతి అంశానికీ సమాధానం ఇవ్వాలని అన్నట్టు తెలుస్తోంది. ఇదిలా ఉండగా తాము 32 అంశాలపై చర్చించాలని, కనీసం 20 రోజుల పాటు సభ నడపాలని కోరినట్టు జేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి చెబుతున్నారు. 15 అంశాలపై చర్చకు బీఏసీలో పట్టుబట్టి నట్టు మాజీ మంత్రి హరీశ్ రావు చెప్పారు. దీంతో పాటు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అసెంబ్లీలో కృష్ణ జలాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. ఒక వేళ మంత్రి పీపీటీ ఇస్తే తమకూ చాన్సివ్వాలని బీఆర్ఎ పట్టుబట్టుతోంది. ఇదే క్రమంలో బీజేపీ జీహెచ్ఎంసీ విస్తరణపైనా చర్చించేందుకు సమయం కోరుతోంది. ఏది ఏమైనా ఈ సారి అసెంబ్లీ సమావేశాలు హాట్ హాట్ గా జరిగే అవకాశాలున్నాయి.

# రక్షణ రంగానికి ఊతం

( మొదటిపేజీ తరువాయి )

ఈ ఒప్పందం ప్రకారం సైన్యానికి సంబంధించిన అనేక ముఖ్యమైన ప్రతిపాదనలు ఆమోదించబడ్డాయి. సైన్యం ఇప్పుడు ఒక లోయిటర్ మునిషన్ వ్యవస్థను అందుకోబోతుంది. ఇది శత్రు లక్ష్యాలపై కచ్చితమైన దాడులను చేస్తుంది. అదేవిధంగా తక్కువ స్థాయి తేలికపాటి రాడార్లు చిన్న, తక్కువ ఎత్తులో ఉన్న శత్రు డ్రోన్‌లు, యూఏఈలను గుర్తించి ట్రాక్ చేస్తుంది. అలాగే నేవీ కూడా ఈ ఒప్పందం ద్వారా తన సామర్థ్యాలను పెంచుకోబోతుంది. ఈ ఒప్పందం కింద నేవీకి ఆమోదించిన ప్రతిపాదనలలో బొల్లార్డ్ పుల్ టగ్‌లు వంటి పరికరాలు ఉన్నాయి. వీటిని ఒకసారి ప్రవేశపెట్టిన తర్వాత, ఇవి ఓడరేవు నావిగేషన్, పరిమిత ప్రదేశాలలో ఓడలు, జలాంతర్గాములకు సహాయపడతాయి. అలాగే హైఫ్రీక్వెన్సీ సాఫ్ట్‌వేర్ డిఫైన్డ్ రేడియో బోర్డింగ్, ల్యాండింగ్ కార్యకలాపాల సమయంలో సురక్షితమైన, దీర్ఘశ్రేణి కమ్యూనికేషన్‌లను మెరుగుపరుస్తుంది. ఈ ఒప్పందం వైమానిక దళానికి గణనీయమైన ప్రయోజనాన్ని కలిగించనుంది. వైమానిక దళం ఆటోమేటిక్ టేకాఫ్, ల్యాండింగ్ రికార్డింగ్ వ్యవస్థను అందుకోబోతుంది. ఇది అన్ని వాతావరణ పరిస్థితులలో టేకాఫ్‌లు, ల్యాండింగ్‌ల హైడెఫినిషన్ రికార్డింగ్ ద్వారా విమాన భద్రతను పెంచుతుంది. అలాగే ఈ ఒప్పందం ద్వారా వైమానిక దళంలోకి ఆస్ట్రా ఎంకే 2 క్షిపణి రాబోతుంది. ఇది సుదూర శ్రేణి, దూరం నుంచి శత్రు విమానాలను కూల్చివేసే సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. అదేవిధంగా వైమానిక దళం స్పైస్ 1000 మార్గదర్శక కిట్‌ను కూడా అందుకోబోతుంది. భారత దేశం 1947లో బ్రిటిష్ రాజ్యం నుంచి స్వాతంత్ర్యం పొందింది. 79 ఏళ్ల స్వాతంత్ర్య భారత్ ఆర్థిక, రక్షణ రంగంలో ప్రపంచ శక్తిగా ఎదిగింది. ఆపరేషన్ సింధూర్ వంటి విజయవంతమైన సైనిక చర్యలు, గల్వాన్‌లో చైనా దురాక్రమణలను తిప్పికొట్టడం, పాకిస్తాన్ కవ్వింపు చర్యలను సమర్థవంతంగా ఎదుర్కోవడం వంటివి భారత్ రక్షణ సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటాయి. ఈ విజయాల వెనుక స్వదేశీ టెక్నాలజీ, స్టార్టప్‌లు, ప్రభుత్వ విధానాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. గతంలో ఏవియానిక్స్, ప్రొపల్షన్ సిస్టమ్స్, రాడార్లు, టార్గెటింగ్ టెక్నాలజీల కోసం విదేశీ సంస్థలపై ఆధారపడిన భారత్, ఇప్పుడు స్వావలంబన దిశగా గణనీయమైన పురోగతి సాధించింది. 2013-14లో 70శాతం దిగుమతులపై ఆధారపడిన రక్షణ రంగం, 2023-24 నాటికి 65శాతం దేశీయ ఉత్పత్తులను సాధించింది. పాజిటివ్ ఇండిజినైజేషన్ లిస్ట్ (పీఐఎల్) ద్వారా 4,500కు పైగా రక్షణ భాగాల దిగుమతులను నియంత్రించి, స్థానిక తయారీని ప్రోత్సహిస్తోంది. ఈ పరివర్తనలో స్వదేశీ డిఫెన్స్ టెక్ స్టార్టప్‌లు కీలక పాత్ర పోషిస్తున్నాయి, ఇవి దేశీయ ఆవిష్కరణల ద్వారా అధిక-విలువైన సైనిక సాంకేతికతలను అభివృద్ధి చేస్తూ ఎగుమతులను పెంచుతున్నాయి. ఆత్మనిర్భర్ భారత్, మేక్ ఇన్ ఇండియా కార్యక్రమాల కింద ప్రభుత్వం రక్షణ రంగంలో స్వావలంబనకు బలమైన పునాది వేసింది. ఇన్నోవేషన్స్ ఫర్ డిఫెన్స్ ఎక్సలెన్స్ (ఐడెక్స్) కార్యక్రమం 2018లో ప్రారంభమై, 200కు పైగా స్టార్టప్‌లకు నిధులు, సాంకేతిక సహకారం అందిస్తోంది. టెక్నాలజీ డెవలప్‌మెంట్ ఫండ్ (టీడీఎఫ్) ద్వారా ప్రాజెక్టులకు రూ.50 కోట్ల వరకు నిధులు కేటాయిస్తోంది. డిఫెన్స్ ఇండస్ట్రియల్ కారిడార్‌లు (తమిళనాడు, ఉత్తరప్రదేశ్) స్థానిక తయారీ, ఆవిష్కరణలను ప్రోత్సహిస్తున్నాయి. 2024-25లో రక్షణ బడ్జెట్ రూ.6.21 లక్షల కోట్లకు పెరిగింది, ఇందులో 75శాతం దేశీయ కొనుగోళ్లకు కేటాయించబడింది. ప్రభుత్వం తక్కువ వాల్యూమ్, అధిక సంక్లిష్టత కలిగిన రక్షణ విభాగాలపై దృష్టి సారిస్తోంది. ఇందులో కాంపోజిట్ ఏరోస్పేస్ నిర్మాణాలు, మిస్సైల్-గ్రేడ్ ప్రిసిషన్ కాంపోనెంట్స్, హార్డెన్డ్ ఎలక్ట్రానిక్స్, స్పెషాలిటీ మిలిటరీ టెక్స్‌టైల్స్ ఉన్నాయి. ఈ రంగాల్లో స్టార్టప్‌లు ఆవిష్కరణల ద్వారా దేశీయ సామర్థ్యాన్ని పెంచుతున్నాయి. భారత్ అమెరికాతో అటానమస్ సిస్టమ్స్ ఇండస్ట్రీ అలయన్స్(ఏఎస్ఐఏ)వంటి ఒప్పందాల ద్వారా సాంకేతిక బదిలీ, సహ-ఉత్పత్తిని వేగవంతం చేస్తోంది. కౌంటర్-యూఏవీ సిస్టమ్స్, స్వయంప్రతిపత్తి మెరిటైమ్ డ్రోన్లు, ఏఐ ఆధారిత మిషన్-క్రిటికల్ సిస్టమ్స్ ఎగుమతులు 2024-25లో రూ.23,622 కోట్లకు చేరాయి, గత దశాబ్దంలో 30 రెట్లు పెరిగాయి. 2029 నాటికి రూ.50 వేల కోట్ల ఎగుమతి లక్ష్యంగా పెట్టుకుంది.



# తొలి రోజే రభస..!

( మొదటిపేజీ తరువాయి )

కౌశిక్ రెడ్డి వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తీవ్రంగా విరుచుకుపడ్డారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఇతర సభ్యులు లేచి నిలబడి అభ్యంతరం తెలిపారు. ఒక ప్రజాప్రతినిధి అయి ఉండి, బాంబులు పెట్టి పేల్చారు అనే పదజాలాన్ని ఎలా వాడతారని వారు ప్రశ్నించారు. సభలో అశాంతిని ప్రేరేపించే విధంగా ఉన్న కౌశిక్ రెడ్డి వ్యాఖ్యలను వెంటనే అసెంబ్లీ రికార్డుల నుంచి తొలగించాలని స్పీకర్‌ను డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా ఉన్న మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు ఎన్నికల సమయంలో కుంగిపోయాయి. అది నిర్మాణ లోపం కారణంగానే కుంగిపోయిందని నిపుణులు నివేదిక ఇచ్చారు .ఈ అంశం రాజకీయంగా చర్చనీయాంశం కావడంతో పాడి కౌశిక్ రెడ్డి పేల్చేశారన్న ఆరోపణలను తెరపైకి తెచ్చారు. సభలో మర్యాదపూర్వక పదజాలం వాడాలని, నిరాధారమైన ఆరోపణలు చేయడం సరికాదని అధికార పక్షం హెచ్చరించింది. ఈ పరిణామాలతో సభలో కొద్దిసేపు వాగ్వాదం చోటుచేసుకుంది.

యూరియా యాప్‌తో రైతులు ఆగమాగం అవుతున్నారని. యాప్ లేకుండా యూరియా పంపిణీ చేయాలని ప్రభాకర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్.. ఇప్పుడు కేవలం 9 గంటలే ఇస్తోందని, ట్రాన్స్‌ఫార్మర్స్, పోల్స్, కరెంట్ వైర్లు కావాలని రైతులు అడిగితే.. బడ్జెట్ లేదని అధికారులు చెప్తున్నారని ఆరోపించారు. మాజీ మంత్రి టి.హరీష్ రావు మాట్లాడుతూ రెండేళ్లయినా ఉద్యోగులకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మోసం చేస్తున్నారని ప్రభుత్వంపై విమర్శలు చేశారు. తక్షణమే ఉద్యోగులకు, రిటైర్డ్ ఉద్యోగులకు, పోలీసులకు ఇచ్చిన హామీ ప్రకారం బకాయిలు విడుదల చేయాలని ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్కను డిమాండ్ చేశారు.



మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ భీంగల్ వంద పడకల ఆస్పత్రి పనులు దాదాపు 85 శాతం పనులు కూడా పూర్తయ్యాయని పేర్కొన్నారు. రూ.5 కోట్లు విడుదల చేస్తే మిగిలిన పనులు పూర్తవుతాయని చెప్పారు. నిధులు విడుదల చేసి పెండింగ్ పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. శాసనసభ లోపల, బయట మాజీ సీఎం కేసీఆర్, సీఎం రేవంత్ రెడ్డి సహా రాజకీయ నాయకులు, మంత్రులు, ఎమ్మెల్యేలు అభ్యంతరకర భాషను వినియోగిస్తున్నారని బీజేపీ ఎమ్మెల్యే కాటేపల్లి వెంకటరమణారెడ్డి ఆందోళన వెలిబుచ్చారు. మన రాజకీయ నాయకుల వల్లే బయట కొందరు గౌరవం లేకుండా మాట్లాడుతున్నారు. కొత్తగా ఎన్నికైన సభ్యులు గౌరవ మర్యాదలతో మాట్లాడాల్సిన అవసరం ఉందన్నారు. ఫ్యూచర్ లో సభకు వచ్చే సభ్యులకు మనం ఆదర్శంగా ఉండేలా ప్రస్తుత నాయకుల భాష ఉండాలని ఆకాంక్షించారు. చాలా మంది సీఎం, మాజీ సీఎం, ప్రధాని పట్ల అగౌరవంగా మాట్లాడుతున్నారన్నారు. చిన్ననాటి మిత్రులు, క్లాస్‌మేట్స్‌తో మాట్లాడినట్టు సంబోధిస్తున్నారని తెలిపారు. సభలో అర్థవంతమైన విమర్శలు, ప్రతివిమర్శలతో చర్చలు కొననసాగించాలని కోరారు. స్పందించిన శాసన సభా వ్యవహారాల మంత్రి డి.శ్రీధర్ బాబు రాజకీయాల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు హుందాకరమైన భాషతో మాట్లాడటం ద్వారా ఆదర్శంగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. సభలో చర్చల సందర్భంగా సభ్యులు అంతా గౌరవప్రదమైన భాషను వినియోగించాలని కోరుతున్నామన్నారు.

# ఉత్తమ్‌కు సీఎం రేవంత్ గాలి సోకింది

( మొదటిపేజీ తరువాయి )

ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని దుయ్యబట్టారు. రెండేళ్లు గడిచినా ఒక్క అనుమతి కూడా తేలేని వారు తమపై నిందలు వేయడం విడ్డూరంగా ఉందని అన్నారు. అసెంబ్లీ నిర్వహణ విషయంలోనూ ప్రభుత్వం తీరు సరిగా లేదని హరీష్ రావు అసహనం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై సమగ్రంగా చర్చించేందుకు సభను కనీసం 15 రోజుల పాటు జరపాలని బీఏసీ సమావేశంలో తాము పట్టుబట్టామని తెలిపారు. అయితే స్పీకర్ వారం రోజులు మాత్రమే నడిపి, ఆ తర్వాత మళ్లీ నిర్ణయిస్తామని చెప్పారని అన్నారు. నదీ జలాల అంశంపై సభలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చేందుకు బీఆర్ఎస్ పార్టీకి కూడా అవకాశం ఇవ్వాలని కోరారు. గతంలో భట్టి విక్రమార్కకు పీపీటీ అవకాశం ఇవ్వనందుకు సభను బాయ్‌కాట్ చేసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో అసెంబ్లీలో కేవలం ఆరు రోజులు మాత్రమే క్వశ్చన్ అవర్ నిర్వహించారని, ఎజెండా కూడా 24 గంటల ముందు ఇవ్వడం లేదని ఆరోపించారు. ప్రోటోకాల్ పాటించకుండా బాల్కొండ ఎమ్మెల్యే లేకుండానే అక్కడ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని అభ్యంతరం వ్యక్తం చేశారు. నీటిపారుదల శాఖపై మంత్రి ఉత్తమ్‌కు ఇంకా పట్టు రాలేదని, సొంత శాఖపై ఎప్పుడు అవగాహన పెంచుకుంటారో తెలియదని హరీష్ రావు ఎద్దేవా చేశారు. తమ హయాంలో పాలమూరు ప్రాజెక్టుకు ఏడు అనుమతులు సాధించామని, రెండు టన్నెళ్ల నిర్మాణం పూర్తి చేశామని వివరించారు. కొడంగల్ నారాయణపేట ఎత్తిపోతలకు రెండేళ్ల క్రితం శంకుస్థాపన చేసినా ఇప్పటికీ డీపీఆర్ పంపలేదన్నారు. ఎస్ఎల్బీసీ సొరంగం పనుల్లో బీఆర్ఎస్ హయాంలో రూ. 1900 కోట్లు ఖర్చు చేసి 11 కిలోమీటర్లు పూర్తి చేస్తే, ఈ ప్రభుత్వం రెండేళ్లలో కేవలం 200 మీటర్లు మాత్రమే తవ్విందని గణాంకాలతో సహా వెల్లడించారు. కల్వకుర్తి ప్రాజెక్టు ద్వారా తాము మూడు లక్షల ఎకరాలకు నీరిస్తే, కాంగ్రెస్ మాత్రం కిలోమీటరు లింక్ కెనాల్ పనులు కూడా పూర్తి చేయలేకపోయిందని విమర్శించారు.



బయట 'తెలంగాణ రైజింగ్' అని బోర్డులు పెడుతున్నారని, కానీ అసెంబ్లీ పనిదినాలు, అభివృద్ధి మాత్రం 'ఫాలింగ్' (పడిపోతున్నాయి) అని చురకలు అంటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మూడు డీపీఆర్‌లు వెనక్కి వచ్చాయని, ఒక్క అనుమతి కూడా సాధించలేకపోయారని అన్నారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి ఇప్పటికైనా తన చేతకానితనాన్ని ప్రతిపక్షాలపై రుద్దడం మానేసి, పెండింగ్‌లో ఉన్న డీపీఆర్‌లను కేంద్రానికి పంపి అనుమతులు సాధించడంపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. గడిచిన 60 ఏళ్లలో కాంగ్రెస్, టీడీపీలు కలిసి పాలమూరుకు లక్ష ఎకరాలకు నీరిస్తే, తాము తొమ్మిదిన్నరేళ్లలోనే ఆరున్నర లక్షల ఎకరాలకు నీరిచ్చామని, ఎవరు ద్రోహులో ప్రజలకు తెలుసని వ్యాఖ్యానించారు. తెలంగాణ శాసనసభ శీతాకాల సమావేశాల నిర్వహణపై స్పష్టతనిచ్చేందుకు నిర్వహించిన బిజినెస్ అడ్వైజరీ కమిటీ సమావేశం ముగిసింది. ఈ సమావేశంలో ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ తరపున మాజీ మంత్రి హరీష్ రావు పాల్గొని, సభ నిర్వహణ తీరుపై పలు కీలక డిమాండ్లను ప్రభుత్వం ముందుంచారు. ముఖ్యంగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం సభను ఎక్కువ రోజులు నిర్వహించాలని ఆయన గట్టిగా పట్టుబట్టారు. బీఏసీ సమావేశం అనంతరం హరీష్ రావు మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో చర్చించాల్సిన అంశాలు చాలా ఉన్నాయని, అందుకే అసెంబ్లీని కనీసం 15 రోజుల పాటు నిర్వహించాలని తాము డిమాండ్ చేసినట్లు తెలిపారు. కేవలం వారం రోజుల్లో ప్రజా సమస్యలన్నింటిపై చర్చించడం సాధ్యం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం కేవలం మూడు లేదా నాలుగు రోజులతో సభను ముగించే ప్రయత్నం చేయకూడదని ఆయన స్పష్టం చేశారు.

# కేటీఆర్ అరెస్ట్ కాబోతున్నాడా?

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

'కేటీఆర్ అరెస్ట్ కాబోతున్నారా? మున్సిపల్ ఎన్నికల వేళ కేటీఆర్‌ను అరెస్ట్ చేసి కాంగ్రెస్ ఎన్నికలకు వెళ్లే సాహసం చేస్తుందా? కేటీఆర్ మాటలు చూస్తుంటే ఏదో జరుగుతున్నట్టే కనిపిస్తోంది. కేటీఆర్ ను అరెస్ట్ చేస్తే మాత్రం అది రాజకీయంగా సంచలనమవుతుంది. ఇప్పటికే అన్ని ఎన్నికల్లో గెలుస్తున్న కాంగ్రెస్‌కు కేటీఆర్ అరెస్ట్ తర్వాత ఎలాంటి ఫలితాలు వస్తాయన్నది ఆసక్తి రేపుతోంది. తెలంగాణ రాజకీయాల్లో మరోసారి అగ్గిరాజేసే పరిణామాలు వేగంగా సాగుతున్నాయి. కేసీఆర్ అసెంబ్లీకి ఇలా వచ్చి అలా వెళ్లిపోవడంతో చప్పున చల్లారిన మంటలు ఇప్పుడు కేటీఆర్ వ్యాఖ్యలతో మరోసారి రాజుకున్నాయి. కేటీఆర్ అరెస్ట్ కాబోతున్నారన్న హింట్ కలకలం రేపుతోంది. ఈ అరెస్ట్ వ్యవహారం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఒకప్పుడు నన్ను అరెస్ట్ చేసే దమ్ముందా? అని సవాల్ విసిరిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. ఇప్పుడు నన్ను అరెస్ట్ చేసేందుకు కుట్రలు జరుగుతున్నాయి అని చేస్తున్న వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీశాయి. మరి కేటీఆర్ చేస్తున్న ఈ వ్యాఖ్యలు కేవలం ఆత్మరక్షణ కోసమేనా? లేక రాబోయే మున్సిపల్ ఎన్నికల కోసం పన్నిన పక్కా వ్యూహామా అన్న అనుమానాలు విశ్లేషకుల్లో కలుగుతున్నాయి. తెలంగాణలో పదేళ్లపాటు తిరుగులేని అధికారం చెలాయించిన కేటీఆర్ ప్రస్తుతం విపక్షంలో ఉండి అధికార కాంగ్రెస్ ను, సీఎం రేవంత్ రెడ్డిని నిలదీస్తున్నారు. గుక్క తిప్పుకోకుండా ఇరుకున పెట్టేలా విమర్శలు గుప్పిస్తున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా తన అరెస్ట్ గురించి ఆయన వరుసగా మాట్లాడుతుండడం



వెనుక బలమైన కారణాలు ఉన్నాయని విశ్లేషఖులు భావిస్తున్నారు.

ముఖ్యంగా కేటీఆర్ అరెస్ట్‌కు భయం ఏంటంటే.. ఫార్ములా ఈ రేసు కేసు. ఈ వ్యవహారంలో ఏసీబీ విచారణ ముదురుతుండడం.. మాజీ అధికారుల వాంగ్మూలాలు కేటీఆర్ కు ఇబ్బందికరంగా మారాయనే ప్రచారం సాగుతోంది.ఈ క్రమంలోనే ఒకవేళ అరెస్ట్ జరిగితే అది 'రాజకీయ కక్ష సాధింపు అని ప్రజల్లోకి తీసుకెళ్లడానికి ఆయన ముందే గ్రౌండ్ ప్రిపేర్ చేస్తున్నట్లు కనిపిస్తోంది. ఇది కేవలం భయం మాత్రమే కాదు.. రాబోయే పరిణామాలను ఎదుర్కోవడానికి సిద్ధం చేసుకుంటున్న సెల్ఫ్ డిఫెన్స్ మెకానిజంగా పలువురు విశ్లేషకులు భావిస్తున్నారు.

తెలంగాణలో త్వరలో మున్సిపల్ ఎన్నికలు జీహెచ్ఎంసీతో సహా కార్పొరేషన్లు, మున్సిపాలిటీలకు జరుగనున్నాయి. హైదరాబాద్‌పై పట్టు సడలితే పార్టీ మనుగడ కష్టమని కేటీఆర్‌కు తెలుసు. ఈ క్రమంలోనే ''ఈ ఎన్నికల ముందు తనను లేకుండా చేసే కుట్ర చేస్తున్నారని.. నేను లోపల ఉన్నా, పార్టీ చూసుకుంటుంది. నేను బెదిరింపులకు భయపడను' అంటూ కేటీఆర్ వ్యాఖ్యానించడం సంచలనమైంది. అందుకే అరెస్ట్ అయితే సానుభూతి వస్తుందని.. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విలన్ గా చిత్రీకరించడం ద్వారా ఓటర్లను ఆకర్షించే ప్రయత్నం కేటీఆర్ ముందే ప్రిపేర్ చేస్తున్నాడని విశ్లేషకులు అంచనావేస్తున్నారు. పార్టీని సిద్ధం చేయడానికి.. నేతలను ఆపడానికి, కేడర్‌లో భరోసా నింపడానికి "నేను జైలుకు వెళ్లడానికైనా సిద్ధం.. మీరు సిద్ధమా?" అనే సంకేతాలను కేటీఆర్ పంపిస్తున్నట్టు తెలుస్తోంది.

ఇటీవల జరిగిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఓటమి బీఆర్ఎస్‌కు గట్టి షాక్ ఇచ్చింది. హైదరాబాద్ సేఫ్ జోన్ అనుకున్న చోటే ఓడిపోవడంతో కేటీఆర్ తన రూట్ మార్చారు. దూకుడు తగ్గించకుండానే జనంలోకి వెళ్లడానికి రెడీ అవుతున్నారు. కేసీఆర్ ను అందుకే యాక్టివ్ చేసినట్టు తెలుస్తోంది. అరెస్ట్‌ను ఒక రాజకీయ అవకాశంగా మార్చుకోవడం.. చట్టపరమైన చర్యలు జరిగితే అది ప్రభుత్వం చేస్తున్న అన్యాయమని కోర్టుల్లోనూ.. ప్రజల్లోనూ వాదించేలా ప్రయత్నాలు చేస్తున్నారు. మున్సిపల్ ఎన్నికల వేళ కేటీఆర్ అరెస్ట్ ప్రచారం బీఆర్ఎస్ శ్రేణుల్లో ఉత్సాహం నింపుతుందా లేదా అధికార పార్టీకి అనుకూలంగా మారుతుందా అనేది కాలమే నిర్ణయించాలి. కేటీఆర్ అరెస్ట్ వ్యవహారం చుట్టూ తిరుగుతున్న రాజకీయాలు తెలంగాణలో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. రేవంత్ రెడ్డి సర్కార్ అడుగులు ఎటువైపు పడతాయో.. కేటీఆర్ ఈ పరిస్థితిని ఎలా ఎదుర్కుంటారో చూడాలి.

## గొర్రెలు, మేకలకు నత్తల నివారణ మందుల పంపిణీ



**సత్తుపల్లి, విశాలభారతి :** మండల పరిధిలోని రామన్నపాలేం గ్రామంలో సోమవారం పశువైద్య శాఖ ఆధ్వర్యంలో గొర్రెలు, మేకలకు నత్తల నివారణ మందుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని పశుపాలకులకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగకరంగా నిలిచింది. ఈ సందర్భంగా సర్పంచ్ జంజునూరి కృష్ణ కుమారీ, ఉప సర్పంచ్ పుచ్చకాయల శంకర్ రెడ్డి గ్రామంలో ఉన్న గొర్రెలు, మేకలకు నత్తల నివారణ మందులను ఉచితంగా వేశారు. పశువుల ఆరోగ్యం మెరుగుపడాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వారు తెలిపారు. గ్రామ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, గొర్రెలు, మేకలను నత్తలతో పాటు ఇతర వ్యాధుల బారిన పడకుండా కాపాడుకోవాలని సూచించారు. పశుసంపద ఆరోగ్యంగా ఉంటే పశుపాలకుల ఆర్థిక స్థితి కూడా మెరుగుపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పశువైద్య శాఖ సిబ్బంది నత్తల నివారణ మందుల వినియోగం, పశుసంరక్షణ చర్యలపై పశుపాలకులకు అవగాహన కల్పించారు. కార్యక్రమానికి నూనె హరిబాబు, పదిలం సాయిబాబు, వెలగపూడి వసంతరావు, కొండపర్తి శ్రీనివాసరావు, షేక్ మొగలా సాహెబ్, చెన్నకేశవ సత్యానారాయణ, బల్లం కోటయ్య, వరప్రసాద్, నల్ల గొర్ల నాగేశ్వరరావు, పల్లెబోయిన వెంకటి తదితరులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. గ్రామంలో ఇలాంటి పశుసంరక్షణ కార్యక్రమాలు నిరంతరం కొనసాగించాలని, పశుపాలకులు ప్రభుత్వం అందిస్తున్న సేవలను పూర్తిగా వినియోగించుకోవాలని పలువురు అభిప్రాయపడ్డారు.

## సిఐటియు జిల్లా కమిటీ సభ్యులుగా కోలికపోగు సర్వేశ్వరరావు



**సత్తుపల్లి, విశాలభారతి :** ఖమ్మం జిల్లా సిఐటియు 12వ మహాసభలు ఈ నెల 27, 28 తేదీల్లో ఖమ్మం పట్టణంలోని మంచికంటి భవన్‌లో ఘనంగా నిర్వహించారు. రెండు రోజులపాటు సాగిన ఈ మహాసభల అనంతరం సిఐటియు నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సత్తుపల్లి పట్టణానికి చెందిన సిఐటియు నాయకులు కోలికపోగు సర్వేశ్వరరావును జిల్లా కమిటీ సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా కార్మిక సమస్యలపై అనేక ఉద్యమాలు, పోరాటాలు నిర్వహిస్తూ అంచెలంచెలుగా ఎదిగిన కార్మిక నేతగా ఆయన గుర్తింపు పొందారు. ఎల్లప్పుడూ కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం ముందుండి పోరాడుతూ, కార్మిక పక్షాన నిలబడిన నాయకుడిగా కోలికపోగు సర్వేశ్వరరావు ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారని పలువురు పేర్కొన్నారు. కార్మిక ఉద్యమంలో ఆయన చేసిన సేవలకు ఈ ఎన్నిక గుర్తింపుగా నిలిచిందని అభిప్రాయపడ్డారు. సిఐటియు జిల్లా కమిటీ సభ్యుడిగా ఎన్నికైన సందర్భంగా పలు ప్రజా సంఘాలు, సామాజిక సంఘాలు, పట్టణ ప్రముఖులు, వివిధ కార్మిక సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్మిక ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు.

## రాజ్యాధికార పార్టీ బలోపేతానికి కృషి చేస్తా

**మండల అధ్యక్షుడు కోటేశ్వరరావు**



**అశ్వాపురం, విశాలభారతి :** మండలంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ బలోపేతానికి తన శక్తివంచన మేర కృషి చేస్తానని ఆ పార్టీ మండల అధ్యక్షుడు విలాసాగరపు కోటేశ్వరరావు అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు తీన్మార్ మల్లన్న ఆదేశాలనుసారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇన్చార్జి నరసయ్య సూచనల మేరకు జిల్లా అధ్యక్షుడు మల్లెల వీరయ్య, బొడ్డు ఏసుబాబు పటేల్ ఆధ్వర్యంలో పాల్వంచలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మొదటి విడతగా నిర్వహించిన మండల అధ్యక్షుల ఎంపికలో భాగంగా మండలం నుండి కోటేశ్వరరావు నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మండల అధ్యక్షుడిగా తనకు అవకాశం కల్పించిన పార్టీ వ్యవస్థాపకులు మల్లన్నకు జిల్లా నాయకత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మండలంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీని విస్తరింప చేసేందుకు తన శక్తివంచనమేరా కృషి చేస్తానని ఆయన తెలిపారు. అదేవిధంగా ప్రతి పంచాయతీలో నూతన కమిటీల కార్యాచరణను చేపడుతున్నట్లు అని తెలిపారు. అలాగే తమ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆదేశాలనుసారం ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కృషి చేస్తానని ఆయన తెలిపారు.

## రాచకొండలో వీకెండ్ స్పెషల్ డ్రైవ్

**డ్రంక్ అండ్ డ్రైవ్ లో 303 మందిపై కేసులు**



**రాచకొండ, విశాలభారతి:** రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వీకెండ్ స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. అందులో భాగంగా రాచకొండ ట్రాఫిక్ పోలీసులు విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేశారు. డ్రైవ్‌లో భాగంగా మొత్తం 303 మందిపై కేసులు నమోదు చేశారు. ఈ డ్రంక్ అండ్ డ్రైవ్ లో 242 మంది ద్విచక్ర వాహన దారులు, 11 ఆటోలు, 50 కార్లు పట్టుకుని వాహనదారులపై కేసులు నమోదయ్యాయి. వీరందరినీ చట్టపరంగా కోర్టుకు హాజరుపర్చనున్నట్లు సంబంధిత పోలీసులు అధికారులు తెలిపారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేయటం తీవ్రమైన నేరమని రాచకొండ పోలీసులు తెలిపారు. మద్యం మత్తులో వాహనం నడిపి ప్రమాదానికి కారణమైతే, భారతీయ న్యాయ సంహిత -2023లోని సెక్షన్ 105 (కల్పబుల్ హోమిసైడ్ నాట్ అమౌంటింగ్ టు మర్డర్) కింద కేసు నమోదు చేస్తామని వారు తెలిపారు.

## నిరుపేదల కాలినడకకు అపర సంజీవిని ఈ దారి



**హాస్పిటల్ కి వెళ్లే దారి సారు.. కాస్త బాగు చేయండి**

**అశ్వాపురం, విశాలభారతి:**

మండల కేంద్రంలోని తురుములగూడెం తండా నుండి ఎస్సీ కాలనీ మీదుగా కాలువబజారు గ్రామంను దాటుకుంటూ ప్రభుత్వ దావాఖానకు నిరుపేదలు కాలినడకన వెళ్లేందుకు అపర సంజీవని లాంటి రహదారి ఒకటి ఉంది. గ్రావెల్ తో నిర్మించిన ఈ రహదారి అనేక గ్రామాల ప్రజలు వారికి ఆరోగ్యం కొంచెం నలతగా ఉన్నప్పుడు ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాలకు వెళ్లేందుకు అనువుగా ఉంటుంది. కాలువ బజార్ నుండి సుమారు ఓ రెండు పరలాంగుల దూరం ఉండే ఈ మట్టిరోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు గుంతల మయంగా మారి ద్విచక్ర వాహనాలు వెళ్లలేని విధంగా తయారయింది. అంతేకాకుండా రైస్ మిల్ సమీపంలో ఓ ఇంట్లో వాడుతున్న వృధా నీరంతా రోడ్డుపైకి వచ్చి చేరడంతో రోడ్డంతా బురదమయంగా మారి వర్షాకాలాన్ని తలపించే విధంగా రోగులు, వృద్ధులు ఇక్కడ నడవలేని విధంగా తయారైంది. దీంతో ఈ మార్గం గుండా అనునిత్యం ఆసుపత్రికి వెళ్లేవారు ఈ బురదను దాటలేక కాలనీ గేటు ముందు నుండి ఆర్ అండ్ బి రోడ్డు మీదుగా చుట్టూ తిరిగి వాహనాల తాకిడి నడుమ అభద్రతా భావంతో రోగులు ప్రభుత్వాసుపత్రికి వెళ్లాల్సి వస్తుందని పలువురు వాపోతున్నారు.

**సర్పంచ్ దృష్టి సారించి రోడ్డుకు మరమ్మత్తులు చేపట్టాలి**

అశ్వాపురం కాలువ బజార్ నుండి ముస్లిం కాలనీ మీదుగా కొర్లకుంట రైస్ మిల్ వెనుక భాగంవరకు అస్తవ్యస్తంగా తయారైన రహదారికి మరమ్మత్తులు చేసి ప్రజా అవసరాలకు ఉపయోగపడేలా పనులు చేపట్టాలని ఆ రహదారి గుండా ప్రయాణించే ప్రజలు సర్పంచ్, ఉపసర్పంచులను వేడుకుంటున్నారు. ఎంతోమంది నిరుపేదలు అనారోగ్యాల పాలైనప్పుడు కాలినడకన ప్రభుత్వ ఆసుపకి వెళ్లేందుకు ఉపయోగపడే ఈ రహదారిని ప్రజలకు సౌకర్యవంతంగా తయారు చేయాలని నూతన సర్పంచిని వేడుకుంటున్నారు. ఈ రహదారిపై గుంతలు ఏర్పడి ద్విచక్ర వాహనాలతో పాటు కాలినడకన వెళ్లే వారికి కూడా అనువుగా లేకపోవడంతో ప్రభుత్వ దవాఖానికి వెళ్లాలంటే సమస్యగా ఉందని సంబంధిత శాఖ అధికారులతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు సొరవ తీసుకుని వెంటనే రోడ్డు పనులను ప్రారంభించి వాడుకలోకి తీసుకురావాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## పాల్వంచలో రెచ్చిపోతున్న ఇసుక మాఫియా



- **అధికారుల నిర్లక్ష్యంతో ఇసుక మాఫియాకు అడ్డు అదుపులేదు**
- **మొర్రేడు వాగు ఒడ్డున లారీలలోకి ఎత్తడానికి సిద్ధంగా ఉన్న ఇసుక కుప్పలు**
- **ఆ మాఫియా డాన్‌కు సహకరిస్తున్నది ఎవరు**

**పాల్వంచ, విశాలభారతి:**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలంలో ఇసుక మాఫియా ఆగడాలు రోజు రోజుకు మితిమీరిపోతున్నాయి.ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి, అధికారుల కళ్లు గప్పి ముర్రేడు వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తూ కొందరు వ్యక్తులు కాసుల వేటలో పడ్డారు. అధికారుల పర్యవేక్షణ లోపం మాఫియాకు వరంగా మారుతోందని స్థానికులు మండిపడుతున్నారు. పాల్వంచ కుంటినాగులగూడెం సమీపంలోని ముర్రేడు వాగు ఒడ్డున ప్రస్తుతం సుమారు నాలుగు లారీలకు సరిపడ ఇసుక నిల్వలు సిద్ధంగా ఉన్నాయి. మాఫియా ముఠా తొలుత ట్రాక్టర్ల ద్వారా వాగు నుంచి ఇసుకను తీసి ఒడ్డున కుప్పలుగా పోస్తోంది.అనంతరం చీకటి పడగానే లేదా అధికారుల కళ్లు గప్పి జేసీబీలతో లారీల్లోకి నింపి ఇతర ప్రాంతాలకు అక్రమంగా తరలిస్తున్నారు. కుంటినాగులగూడెం పెట్రోల్ బంక్ సమీపంలోనే ఈ లారీలు, జేసీబీలు తిష్టవేసి ఉంటున్నట్లు విశ్వసనీయ సమాచారం.

**అధికారుల ఉదాసీనతపై అనుమానాలు**

ప్రస్తుతం రెవెన్యూ మరియు పోలీస్ యంత్రాంగం భద్రాచలం ముక్కోటి ఏకాదశి ఉత్సవాల ఏర్పాట్లలో నిమగ్నమై ఉండటాన్ని ఇసుక మాఫియా ఆసరాగా చేసుకుంటోంది.ఆదివారం ముల్కలపల్లి మండలం సీతారాంపురంలో 6 ట్రాక్టర్ల ఇసుకను సీజ్ చేసిన అధికారులు, ఇక్కడ బహిరంగంగా జరుగుతున్న దందాను ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గతంలో వరుసగా మూడు కేసులు నమోదైతే పిడి యాక్ట్ నమోదు చేయడం లేదా రౌడీ షీట్ ఓపెన్ చేసే నిబంధనలు ఉన్నప్పటికీ, సదరు ఇసుక డాన్ విషయంలో పోలీసులు ఎందుకు అంత ఉదాసీనత ప్రదర్శిస్తున్నారో అర్థం కావడం లేదని మాఫియా డాన్ కు సహకరిస్తున్నది ఎవరు అని స్థానికులు వాపోతున్నారు.

**ప్రభుత్వ ఖజానాకు భారీగండి**

ప్రభుత్వ ఖజానాకు బారిగండీ కొడుతున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా, ప్రభుత్వానికి చెల్లించాల్సిన ఫీజులు ఎగ్గొడుతూ లక్షల రూపాయల విలువైన ఇసుకను తరలిస్తూ ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా ఇసుక లేదా మట్టి ఏదో ఒక రూపంలో అక్రమ రవాణా నిరంతరం సాగుతూనే ఉంది.

**ఉన్నతాధికారులు దృష్టి సారించాలి**

ఇప్పటికైనా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, కుంటినాగులగూడెం సమీపంలో సిద్ధంగా ఉన్న ఇసుక నిల్వలను సీజ్ చేయాలని, అక్రమ దందాకు పాల్పడుతున్న వారిపై కఠినమైన క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు

## రాబోయే ఎన్నికలలో గులాబీ జెండా ఎగరడం ఖాయం

**మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్**



**కోదాడ, విశాలభారతి:** కోదాడ మండల పరిధిలోని కాపుగల్లు గ్రామంలో ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలలో సర్పంచ్ గా గెలుపొందిన దొంతగాని అప్పారావు, వార్డు సభ్యులను మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికలలో గులాబీ జెండా ఎగరడం ఖాయం అని ధీమా వ్యక్తం చేశారు. ఈ ఎన్నికలలో గెలిచిన అందరికీ అభినందనలు తెలిపారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని, కాంగ్రెస్ పై ప్రజలకు నమ్మకం పోయిందన్నారు.అధినేత కేసీఆర్ నాయకత్వాన్ని రాష్ట్ర ప్రజలంతా కోరుకుంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దొంతగాని అప్పారావు, ఒకటో వార్డు మెంబర్ గుండెబోయిన ఏడుకొండలు, బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అథ్లెటిక్స్ పోటీల్లో బంగారు పతకం సాధించిన భవాని



**హైదరాబాద్, విశాలభారతి:** తెలంగాణ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభను చాటుతూ చైతన్య భారతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న మెలవరపు భవాని బంగారు పతకాన్ని సాధించి ఘనవిజయం సాధించారు. డిసెంబర్ 27, 28 తేదీల్లో నిర్వహించిన ఈ పోటీల్లో ఆమె అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి మొదటి స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా విజేతకు నిర్వాహకులు బంగారు పతకం మరియు ప్రశంసా పత్రాన్ని అందజేశారు. కఠినమైన సాధన, పట్టుదల, క్రమశిక్షణే తన విజయానికి ప్రధాన కారణమని భవాని తెలిపారు. మహిళా క్రీడాకారులకు ఆమె సాధించిన విజయం ఎంతో ప్రేరణగా నిలుస్తుందని క్రీడా నిపుణులు అభిప్రాయపడ్డారు. భవాని సాధించిన ఈ విజయంపై సీబీఐటి కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి. వి. నరసింహులు గారు ఆమెను అభినందిస్తూ, ఉద్యోగ బాధ్యతలతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరచడం ప్రశంసనీయమని పేర్కొన్నారు. అలాగే వైస్ ప్రిన్సిపాల్ (అడ్మినిస్ట్రేషన్) ప్రొఫెసర్ పి. వి. ఆర్. రవీంద్ర రెడ్డి మాట్లాడుతూ, భవాని విజయం సంస్థకు గర్వకారణమని అన్నారు. ఈ సందర్భంగా కళాశాల సీనియర్ ప్రొఫెసర్ వెంకట్ బార్ల, పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ డాక్టర్ జి. ఎన్. ఆర్. ప్రసాద్, క్రీడాభిమానులు మరియు శ్రేయోభిలాషులు భవానిని అభినందించారు. భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించాలని వారు ఆకాంక్షించారు.

## సీబీఐటీలో బోధనేతర సిబ్బందికి రెండు రోజుల కార్యశాల

**హైదరాబాద్, విశాలభారతి:** చైతన్య భారతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీబీఐటీ), మరియు మహాత్మాగాంధీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎమ్ జి ఐటీ) నాన్‌టీచింగ్ సిబ్బంది కోసం నిర్వహిస్తున్న "ఆఫీస్ అడ్మినిస్ట్రేషన్, డాక్యుమెంటేషన్, ల్యాబొరేటరీ & క్యాంపస్ మెయింటెనెన్స్ మరియు ప్రొఫెషనల్ స్కిల్స్" అంశాలపై రెండు రోజుల వర్క్‌షాప్‌లో మొదటి రోజు కార్యక్రమాలు 29 డిసెంబర్ 2025న విజయవంతంగా పూర్తయ్యాయి. ఈ వర్క్‌షాప్ నాన్‌టీచింగ్ సిబ్బంది పరిపాలనా నైపుణ్యాలు, వృత్తి నైతికత మరియు పనితీరును మెరుగుపరచడం లక్ష్యంగా నిర్వహించబడింది. వర్క్‌షాప్ ప్రారంభ సమావేశంలో మంగళాయతన్ యూనివర్సిటీ, జబల్పూర్ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కె. ఆర్. ఎస్. సాంబశివ రావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. విద్యా సంస్థల సజావు నిర్వహణలో నాన్‌టీచింగ్ సిబ్బంది పాత్ర ఎంతో కీలకమని ఆయన పేర్కొన్నారు. మిజోరామ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ప్రొఫెసర్ పి. వి. నాగంజనేయులు గౌరవ అతిథిగా పాల్గొని, నిరంతర వృత్తి అభివృద్ధి మరియు బాధ్యతాయుత సేవల ప్రాధాన్యతను వివరించారు. మధ్యాహ్నానంతరం సెషన్లు అసెంబ్లీ హాల్ మరియు డీబ్లాక్ సెమినార్ హాల్‌లలో రెండు సమాంతర బ్యాచ్‌లుగా నిర్వహించబడ్డాయి. డా. ఎం.సి.ఆర్ హెచ్‌ఆర్‌డీ ఇన్స్టిట్యూట్ ఫ్యాకల్టీ (రిటైర్డ్) శ్రీ డి. శివ ప్రసాద్ కార్యాలయ పరిపాలన, డాక్యుమెంటేషన్ మరియు ప్రొఫెషనల్ స్కిల్స్‌పై అవగాహన కల్పించారు. అదే సమయంలో సీబీఐటీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి. వి. నరసింహులు సంస్థాగత పరిపాలన మరియు సిబ్బంది బాధ్యతలపై, క్యాంపస్ కన్స్ట్రక్షన్ అడ్వైజర్ శ్రీ పి. శ్రీనివాస శర్మ పనితీరు సామర్థ్యం మరియు కార్యాలయ ఉత్పాదకతపై, సీబీఐటీ ఎస్ఎంఎస్ ఇండస్ట్రీ ప్రొఫెసర్ ప్రొఫెసర్ వి. బర్లా వృత్తి నైతికత మరియు స్వీయ అవగాహనపై, అలాగే సీబీఐటీ అకడమిక్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ పి. ప్రభాకర్ రెడ్డి నాణ్యత భరోసా మరియు అక్రిడిటేషన్ అంశాలపై విలువైన ఉపన్యాసాలు అందించారు. నాన్‌టీచింగ్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని చురుకుగా స్పందించడంతో మొదటి రోజు కార్యక్రమాలు ఎంతో ప్రయోజనకరంగా సాగాయి. ఈ వర్క్‌షాప్ ద్వారా సీబీఐటీ మరియు ఎమ్ జి ఐటీ తన నాన్‌టీచింగ్ సిబ్బంది సామర్థ్యాభివృద్ధి మరియు సమగ్ర అభివృద్ధికి ఉన్న నిబద్ధతను మరోసారి చాటింది.



## ఘనంగా మానేపల్లి జ్యువలర్స్ అధినేత జన్మదిన వేడుక



**చౌటుప్పల్, విశాలభారతి:** ప్రముఖ వ్యాపార వేత్త మానేపల్లి జ్యువలర్స్ అధినేత మానేపల్లి మురళీ కృష్ణ జన్మ దినోత్సవం సందర్బంగా భారతీయ జీవిత బీమా ఏజెంట్ కౌటికే విటల్ హైదరాబాదులోని బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రిలో అన్న సంతర్పణ కార్యక్రమం చేయడం జరిగింది.అలాగే కేక్ ను కట్ చేసి వారికీ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మురళీకృష్ణ తన సమీప బంధువైన ప్రియా గోల్డ్ యాజమాని బుక్క శ్రీనివాస్ వచ్చి అన్న సంతర్పణం ప్రారంభించారు.ఈ సందర్భంగా బొక్క శ్రీనివాస్,కౌటికె విటల్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమ వంతుగా తమరు సంపాదించిన దాంట్లో కొంతమేరకు దానం చేయాలి అని తెలిపారు.అడ్వకేట్ మడిపల్లి రవి మాట్లాడుతూ కౌటికె విటల్ తమ పాలసీదారులకు విశేష సేవలు అందిస్తున్నారు.తమ పాలసీదారుల జన్మదినోత్సవాలను పురస్కరించుకొని క్యాన్సర్ ఆస్పత్రి వద్ద రోగులకు అన్న సంతర్పణం చేయడం అభినందనీయమని ఆయన తెలిపారు.భారతదేశంలో 26 జీవిత బీమా కంపెనీలలో ఇలాంటి సంప్రదాయం ఎక్కడా లేదు అని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆదిత్య,ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రొటెస్టెంట్ క్రైస్తియన్లకు అధిక ప్రాధాన్యత అవసరం



**కోదాడ, విశాలభారతి:** రాష్ట్రంలో ప్రొటెస్టెంట్ క్రైస్తియన్ల సమస్యలకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోదాడ నియోజకవర్గ యునైటెడ్ పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు యేసయ్య సోమవారం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం.నరేందర్ రెడ్డి మాటల ప్రకారం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని ఆయన తెలిపారు. యునైటెడ్ పాస్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర పాస్టర్స్ అండ్ క్రైస్తియన్ల అసోసియేషన్ నేతలతో చర్చలు జరిపి, గోనే సాల్మన్ రాజ్‌ను చైర్మన్‌గా, వైస్ చైర్మన్, డైరెక్టర్లు ఇతర పదవుల కేటాయింపులో ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. అసోసియేషన్ నాయకులు ప్రొటెస్టెంట్ క్రైస్తియన్‌లకు నామినేటర్ పదవుల కేటాయింపులో అధిక ప్రాధాన్యత కల్పించాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి అండగా ఉంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వంటపాక జానకి, సుందర్ రావు, రాజేష్, ప్రభుదాస్ నడిగూడెం, ఏసురత్నం ఇతర నేతలు పాల్గొన్నారు.

## ఐఐటీలో సీట్లు సాధించిన విద్యార్థులకు సన్మానం



**కోదాడ, విశాలభారతి:** విద్యార్థులకు విద్యతోనే మంచి భవిష్యత్తు ఉందని విద్యను ఎవరు దొంగలించలేరని గొప్ప చదువులు చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని శ్రీ చైతన్య ఈజిఎం మురళీకృష్ణ అన్నారు. 2022 23 విద్యా సంవత్సరంలో శ్రీ చైతన్య రెసిడెన్షియల్ క్యాంపస్ లో 10వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఐఐటీలో 22 మంది, ఎన్ఐటీలో 29 మంది, ఎయిమ్స్ ఢిల్లీలో ఒకరు సీట్లు సాధించారు. సోమవారం శ్రీ చైతన్య రెసిడెన్షియల్ క్యాంపస్ లో ఏర్పాటు చేశార. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీ చైతన్య ఈజీఎం మురళీకృష్ణ పాల్గొని విద్యార్థులను శాలువా బొకేతో ఘనంగా సత్కరించి వారికి అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మా పాఠశాలలో 10వ తరగతి పూర్తి చేసుకుని మా కళాశాలలోనే ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులు ఐఐటి, ఎన్ఐటి లో సీట్లు సాధించడం అభినందనీయమని అన్నారు. వీరిలో ఒక విద్యార్థి ఆల్ ఇండియా 8వ ర్యాంకు సాధించి ఎయిమ్స్ ఢిల్లీలో సీటు సాధించినట్లు తెలిపారు. మా పాఠశాలలో చదివిన సూపర్ సీనియర్ శృతిలయ వారణాసి ఐఐటీలో సీటు సాధించి 60 లక్షల ప్యాకేజీ సాధించినందుకు ఆమెని ఘనంగా సత్కరించామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ వెంకటయ్య, తెలంగాణ కోఆర్డినేటర్ జయరాజు, ప్రిన్సిపల్ గోపాలస్వామి, సూర్యాపేట కోఆర్డినేటర్ వెంకట్, విద్యార్థినీ విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు వివాహ నగదు ప్రోత్సాహ పథకం

**జిల్లా సంక్షేమ అధికారి సబిత**



**మహబూబాబాద్, విశాలభారతి:** రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల వయోవృద్ధుల మరియు ట్రాన్స్ జెండర్ వ్యక్తుల సంక్షేమ శాఖ, హైదరాబాదు వారి ఆదేశాల మేరకు దివ్యాంగులు, సకలాంగుల మధ్య వివాహానికి దివ్యాంగులు, దివ్యాంగుల మధ్య వివాహానికి 1 లక్ష రూపాయల నగదు ప్రోత్సాహంగా అందజేస్తుందని జిల్లా సంక్షేమ అధికారి సబిత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అర్హులైన దివ్యాంగులు వివాహం జరిగిన సంవత్సరంలోపు www.telangana.epass.gov.in వెబ్సైట్ నందు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## చైనా మాంజా విక్రయిస్తే జైలు తప్పదు

**మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. శబరీష్**



**మహబూబాబాద్, విశాలభారతి:** మహబూబాబాద్ జిల్లా పరిధిలో నిషేధిత చైనా మాంజా విక్రయం, వినియోగంపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ డా. శబరీష్ స్పష్టం చేశారు. సంక్రాంతి పండుగ సమీపిస్తున్న నేపథ్యంలో గాలిపటాల ఎగరవేతకు యువత సిద్ధమవుతున్న తరుణంలో, ప్రమాదకరమైన చైనా మాంజా వినియోగం పెరిగే అవకాశం ఉన్నందున ముందస్తు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. చైనా మాంజా (సింథటిక్ దారం, గాజు పొడి కలిపిన దారం) వినియోగం వల్ల పక్షుల మెడలు, రెక్కలు కోసుకుపోవడం, ద్విచక్ర వాహనదారులు తీవ్రంగా గాయపడటం, ప్రాణనష్టం సంభవించే ప్రమాదం ఉందని ఎస్పీ తెలిపారు. ప్రజల ప్రాణాలకు తీవ్ర ముప్పుగా మారిన ఈ మాంజాను ఎవరైనా విక్రయించినా లేదా వినియోగించినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చైనా మాంజా విక్రయం లేదా వినియోగంలో పాల్గొన్నవారికి ఏడేళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉందని, ఇది చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు. నిషేధిత మాంజా నిల్వలు, విక్రయాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు చైనా మాంజాను పూర్తిగా నివారించి, ప్రభుత్వ అనుమతితో ఉన్న కాటన్ దారాలతో మాత్రమే గాలిపటాలు ఎగరవేయాలని సూచించారు. ఎవరైనా చైనా మాంజా విక్రయిస్తున్నట్లు లేదా వినియోగిస్తున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని జిల్లా ఎస్పీ ప్రజలను కోరారు.

## ఫిట్స్‌తో నవ వధువు మృతి

**భర్త పై పోలీసులకు ఫిర్యాదు చేసిన తల్లిదండ్రులు**



**రాజేంద్రనగర్, విశాలభారతి:** అనుమానాస్పద స్థితిలో ఓనవధువు ఫిట్స్ తో మృతి చెందింది. ఈ సంఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్ కర్నూల్ జిల్లాకు చెందిన రాజు, అదేవిధంగా మహబూబ్ నగర్ కు చెందిన ఐశ్వర్య కొన్ని రోజుల క్రితం ప్రేమించుకున్నారు. పెద్దలను ఎదిరించి నవంబర్ నెలలో పెళ్లి చేసుకున్నారు. రాజేంద్ర నగర్ డైరీ ఫార్మ్ సమీపంలో గోల్డెన్ హైట్స్ కాలనీలో దంపతులు ఉంటున్నారు. అయితే, ఇలా ఉండగా.. ఆదివారం సాయంత్రం ఐశ్వర్య భర్త తో కలిసి జూబ్లీహిల్స్ లోని తమ కుటుంబం దగ్గరికి వెళ్ళింది. సోమవారం ఉదయం 5 గంటలకు తిరిగి వచ్చారు. అయితే, కొద్ది సేపటికి అస్వస్థతకు గురైన ఐశ్వర్య కింద పడి ప్రాణాలు కోల్పోయింది. ఫిట్స్ రావడంతో మృతి చెండిందని భర్త పోలీసులకు తెలిపాడు. అల్లుడిపై అనుమానం వ్యక్తం చేస్తూ ఐశ్వర్య తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# గ్రామాభివృద్ధే ధ్యేయంగా ముందుకు..!

- గ్రామ సమస్యల పరిష్కారంపై దృష్టి
- రాజకీయాలకు అతీతంగా పాలనకు హామీ
- మాంగోరిగూడెన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దే లక్ష్యం
- పేదవారికి అండగా నిలుస్తున్న ఉపసర్పంచ్ పిట్టల నీణా వీరన్న గౌడ్




**మహబూబాబాద్, విశాలభారతి:**

గ్రామాభివృద్ధే లక్ష్యంగా, ప్రజల నమ్మకాన్ని మూలధనంగా చేసుకుని మాంగోరిగూడెం గ్రామాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని నూతన సర్పంచ్ జాటోత్ శాంతి కలుపుకొని ఉపసర్పంచ్ పిట్టల వీణావీరన్న గౌడ్ తెలిపారు. ప్రజల ఆశీర్వాదాలతో, గ్రామ వార్డు సభ్యులు లూనవత్ నీల, దారావత్ మోహన్, గుగులోత్ విజయ, జాటోత్ బిక్కు, దెంకాల సత్యం, గుగులోత్ పరమేష్, జాటోత్ ప్రియాంక, గ్రామ పెద్దలు, యువకులు, ప్రజల సహకారంతో అభివృద్ధి బాటలో పయనిస్తానని ఉపసర్పంచ్ స్పష్టం చేశారు.

**సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి..**

గ్రామంలో పేరుకుపోయిన సమస్యలను దశలవారీగా పరిష్కరించాలనే సంకల్పంతో సర్పంచ్, ఉపసర్పంచ్ గా బాధ్యతలు చేపట్టిన శాంతి, వీణవీరన్నలు బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచే అభివృద్ధి పనుల్లో నిమగ్నమయ్యారు.

**ప్రజల నమ్మకానికి న్యాయం చేస్తా..**

గ్రామ అభివృద్ధిలో నిమగ్నమైన ఆమె ఈ సందర్భంగా మాట్లాడుతూ.., "నన్ను నమ్మి గెలిపించిన ప్రతి ఒక్కరి నమ్మకాన్ని వమ్ము చేయను. మాంగోరిగూడెం గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే మా ప్రధాన లక్ష్యం" అని సర్పంచ్, ఉపసర్పంచ్ పిట్టల వీణ అన్నారు. అన్ని రంగాల్లో సమగ్ర అభివృద్ధి చేస్తానని, తాగునీరు, రహదారులు, డ్రైనేజీ, పారిశుధ్యం, విద్యుత్ సరఫరా, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాల్లో ఎలాంటి లోపాలు లేకుండా పనిచేస్తామని తెలిపారు. ప్రతి అర్హుడికి ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా అధికారులతో సమన్వయం చేస్తానని హామీ ఇచ్చారు.

**రాజకీయాలకు అతీతంగా పాలన..**

గ్రామాభివృద్ధి విషయంలో రాజకీయాలకు తావులేకుండా, పార్టీలకు అతీతంగా అందరినీ కలుపుకొని ముందుకు సాగుతానని చెప్పారు. గ్రామాన్ని మండలానికే ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే తన సంకల్పమని వెల్లడించారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, నిజాయితీతో, పారదర్శకంగా పాలన అందిస్తానని సర్పంచ్, ఉపసర్పంచ్ పిట్టల వీణ స్పష్టం చేశారు.

**పేదలకు అండాగా నిలుస్తున్న పిట్టల వీణా..**

మాంగోరిగూడెం గ్రామంలో తమ మామయ్య పిట్టల నర్సయ్య రెండు సార్లు వార్డు సభ్యులు, అత్తగారైనా పిట్టల రాములమ్మ మూడు సార్లు వార్డు సభ్యులుగా విజయం సాధించిన గ్రామ అభివృద్ధి కోసం కృషి చేశారు. అత్త మామని ఆదర్శంగా తీసుకొని వారి అడుగుజాడలో నిరుపేదలకు అండాగా నిలుస్తూ వారికి సహాయం చేస్తున్నారు. ఏకగ్రీవంగా గెలిచిన పిట్టల వీణవీరన్న ఇప్పటికే పేదలకు అండగా నిలుస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇటీవల గ్రామంలో మృతుల కుటుంబాలని పరమార్శించి తడినం రాములు కుటుంబానికి 50 కిల్వల బియ్యం, అలాగే ఎస్సి కాలనిలో ఎల్లంపేట వీరమ్మ కుటుంబానికి 25 కిలోల బియ్యం అందజేశారు. అయ్యప్ప స్వాముల ఆశీర్వాదం తీసుకున్న ఆమె ఈ నెల 25న క్రిస్మస్ పండుగ సందర్భంగా ఏసుక్రీస్తు పుట్టిన జన్మస్థలం నుండి అయిలు తీసుకొచ్చి భక్తులకు సమర్పించి శాల్వలతో సన్మానం చేసి స్విట్లు పంపిణి చేశారు. గ్రామ బొడ్రాయి సమీపంలో వెంకట నర్సయ్య శ్రీ సీతా రామాలయం నిర్మాణం కోసం భూమి కల్పించి భుదాతగా నిలిచారు. ఆలయం నిర్మాణం కోసం గ్రామ సర్పంచ్ జాటోత్ శాంతి రూ. 10 లక్షలు, గ్రామ ఉపసర్పంచ్ పిట్టల వీణవీరన్న రూ. 2 లక్షలు విరాళాలు ఇచ్చారు. ఇలా గ్రామ ఉపసర్పంచ్ వీణవీరన్న గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులను కలుపుకొని ఐక్యంగా గ్రామాన్ని ఆదర్శంగా అభివృద్ధి చేయడం కోసం ముందుకు వెళ్తున్నారు.

## రాజేష్ మృతదేహానికి రీ పోస్టుమార్టం చేయాలి




**ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవిందు నరేష్ మాదిగ**

**కోదాడ, విశాలభారతి:**

మునగాల మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో గత ఎనిమిది రోజులుగా జరుగుతున్న రిలే నిరాహార దీక్షలను ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గోవిందు నరేష్ మాదిగ, సోమవారం నాడు సంఘీభావం తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ, కర్ల రాజేష్ లాకప్ డెత్ ఘటనలో ప్రధాన కారకుడు చిలుకూరు ఎస్సై సురేష్ రెడ్డి అన్నారు. కర్ల రాజేష్ ను చట్ట విరుద్ధంగా కస్టడీలోకి తీసుకుకొని చిత్రహింసలు పెట్టింది అతనికి చనిపోయే పరిస్థితి తీసుకొచ్చింది చిలుకూరు ఎస్ఐ సురేష్ రెడ్డినే అన్నారు. ప్రధాన కారకుడుగా ఉన్న చిలుకూరు ఎస్సై సురేష్ రెడ్డిని సస్పెండ్ చేయకుండా కేవలం కోదాడ రూరల్ సిఐ ప్రతాప లింగం గారిని సస్పెండ్ చేయకపోవడం దారుణమైన చర్యను అన్నారు. కుల వివక్షతను పోలీసు ఉన్నతాధికారులు పాటిస్తున్నారని అన్నారు. చిలుకూరు ఎస్సై రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారు కావడం వల్లే సస్పెండ్ చేయడం లేదు అని అన్నారు. తక్షణమే ఎస్ఐ సురేష్ రెడ్డిని సస్పెండ్ చేయాలని అలాగే కర్ల రాజేష్ ఉంటది అని పనులైన నిపుణులైన ఫోరెన్సిక్ డాక్టర్లచేత పోస్టుమార్టం చేయించాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లను నెరవేరేంతవరకు మందకృష్ణ మాదిగ పిలుపుమేరకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని నిరాహార దీక్షలు కొనసాగిస్తామని తెలిపారు. ఈ ఈ కార్యక్రమంలో బచ్చలకూరి వెంకటేశ్వర్లు మాదిగ,ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి సూర్యాపేట జిల్లా ఇన్చార్జి బొడ సునీల్ మాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్రఉపాధ్యక్షులు ఎమ్మెస్ పి రాష్ట్రనాయకులు ఎర్ర వీరస్వామిమాదిగ, ఎంఎస్పి జిల్లా అధికార ప్రతినిధి ఏపూరి రాజు మాదిగ, ఎంఎస్పి రాష్ట్రనాయకులు యలమర్తి రాము మాదిగ, ఎం.ఎస్.పి.జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి అంజయ్య మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాతకోట్ల నాగరాజు మాదిగ, ఎమ్మార్పీఎస్ మునగాల మండలం అధ్యక్షులు గుడిపాటి కనకయ్య మాదిగ, భారాఖతు గూడెం గూడెం గ్రామశాఖ అధ్యక్షులు గుడిపాటి పెద్ద కనకయ్య మాదిగ, ఆకుపాముల గ్రామశాఖఅధ్యక్షులు తాళ్లపాక వీరబాబు మాదిగ, ఎమ్మార్పీఎస్ నాయకులు ములుగురు వెంకటేశ్వర్లు మాదిగ, ఎంఆర్పిఎస్ నాయకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## లక్ష్మీనరసింహస్వామి గుట్టను పుణ్యక్షేత్రంగా అభివృద్ధి చేస్తాం



**సర్పంచ్ రావుల భవాని వెంకటేశ్వర్లు, భాషబోయిన భాస్కర్ రావు**

**కోదాడ, విశాలభారతి:**

కోదాడ మండల పరిధిలోని యర్రవరం గ్రామంలో వెలసిన ప్రసిద్ధ దూళ్ళగుట్ట లక్ష్మీనరసింహస్వామి గుట్టను సమగ్రంగా అభివృద్ధి చేసి రాష్ట్ర స్థాయి పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దేందుకు అన్ని విధాల కృషి చేస్తామని గ్రామ సర్పంచ్ రావుల భవాని వెంకటేశ్వర్లు, ముదిరాజ్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు భాషబోయిన భాస్కర్రావు అన్నారు. సోమవారం యర్రవరం గ్రామంలోని శ్రీ బాల ఉగ్ర లక్ష్మీనరసింహస్వామి దేవాలయ ఆవరణలో నిర్వహించిన సన్మాన సభ కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. దూళ్ళగుట్ట లక్ష్మీనరసింహస్వామి గుట్టకు నిత్యం కోదాడ నియోజకవర్గంతో పాటు పరిసర జిల్లాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో దర్శనానికి వస్తున్నారని తెలిపారు. అయితే భక్తుల సంఖ్యకు అనుగుణంగా అవసరమైన మౌలిక వసతులు ఇంకా పూర్తిస్థాయిలో అందుబాటులో లేవని పేర్కొన్నారు.ఆలయ పరిసర ప్రాంతాల్లో రహదారి సదుపాయం మెరుగుపరచడం, విద్యుత్ సరఫరాను పటిష్టం చేయడం, శుద్ధ తాగునీటి సౌకర్యం కల్పించడం, పారిశుధ్య నిర్వహణ, భక్తుల కోసం విశ్రాంతి మందిరాలు, షెడ్లు, మరుగుదొడ్లు వంటి వసతులు ఏర్పాటు చేయడంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. గుట్టపైకి వెళ్లే దారిని మరింత సౌకర్యవంతంగా అభివృద్ధి చేయడంతో పాటు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. దేవాలయ అభివృద్ధి జరిగితే యర్రవరం గ్రామానికి ఆధ్యాత్మికంగా ప్రత్యేక గుర్తింపు లభించడంతో పాటు గ్రామంలో వ్యాపారాలు, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అన్నారు. దేవాలయంలో పనిచేసే కార్మికుల జీతభత్యాల సమస్య కూడా పరిష్కరిస్తామన్నారు. భక్తుల రాకతో స్థానిక యువతకు ఉపాధి కల్పనకు అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు. గ్రామ ప్రజలు, భక్తులు అందరూ సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు.ముందుగా పాలకవర్గాన్ని ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సయ్యద్ శాలిని మస్తాన్, ఆలయ గౌరవ సభ్యులు బ్రహ్మయ్య, వార్డు సభ్యులు ఎం శ్రీను, పి శ్రీహరి, భవాని, నరసింహారావు, నెట్టెం నాగేంద్ర, గ్రామ నాయకులు, భక్తులు, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## చర్చి గుడి పండుగకు హాజరైన మాజీ మంత్రి



**దేవరుప్పుల, విశాలభారతి:** డిసెంబర్ 25 క్రిస్మస్ పండుగ తర్వాత దేవరుప్పుల మండలం, కడవెండి గ్రామంలో చర్చి వారి ఆనవాయితీ ప్రకారం జరిగే క్రైస్తవ తీరుకుటుంబ గుడి పండుగ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక ప్రార్థనలో పాల్గొని ప్రభువు ఆశీర్వాదం పొందిన రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు. ఈ కార్యక్రమంలో జిల్లా బిఆర్ఎస్ నాయకుడు పల్లా సుందర్ రాంరెడ్డి,మాజీ మండల అధ్యక్షుడు బస్వ మల్లేష్, మండల అధ్యక్షకార్యదర్శులు తీగల దయాకర్ గౌడ్,చింత రవి,యూత్ అధ్యక్షుడు నవీన్ నాయక్ ,మండల, గ్రామ బీఆర్ఎస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,యూత్ అండ్ సోషల్ మీడియా నాయకులు పాల్గోన్నారు.

## సర్పంచ్ పల్లెర్ల సంధ్య రాణి నవీన్‌కి ఘన సన్మానం



**దేవరుప్పుల, విశాలభారతి:** మండలం నీర్మల గ్రామంలో నూతన సర్పంచిగా ఎన్నుకోబడిన పల్లెర్ల సంధ్యారాణి నవీన్ నీర్మల హరిజన కాలనీ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్లు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో సర్పంచ్ పల్లెర్ల సంధ్యారాణి మాట్లాడుతూ గ్రామ సర్పంచిగా తనకు అవకాశం ఇచ్చిన గ్రామస్తులందరికీ ధన్యవాదాలు తెలిపారు. గ్రామ అభివృద్ధితోపాటు పాఠశాల అభివృద్ధికి కూడా తోడ్పాటునందిస్తానని తెలిపారు.అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శివగారి కిరణ్ కుమార్ మాట్లాడుతూ సర్పంచ్‌గా ఎన్నికైన తర్వాత మొట్టమొదటిసారిగా మా పాఠశాలకు రావడం మాకు చాలా సంతోషంగా ఉందని , సర్పంచ్ ఆధ్వర్యంలో గ్రామం అన్ని విధాల అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కిరణ్ కుమార్ తో పాటు అంగన్వాడి టీచర్లు నల్ల నీర్మల, రాజోజు లక్ష్మి, తల్లిదండ్రులు నల్ల నరసింహులు , మేడ రమ, నక్క స్రవంతి, పూజ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ అరెస్టులు ఖండిస్తున్నాం



**కోదాడ, విశాలభారతి:** గ్రామ పాలనకు వెన్నెముకలైన పాత సర్పంచులు చేసిన అభివృద్ధి పనుల బిల్లులు నేటికీ చెల్లించకపోవడం రాష్ట్ర ప్రభుత్వ దారుణ వైఫల్యానికి నిదర్శనమనీ, కోట్ల రూపాయల విలువైన పెండింగ్ బిల్లులు ఉండగా, గ్రామాల్లో అప్పుల పాలైన సర్పంచులు ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నారు. ఈ సందర్భంగా సర్పంచల ఫోరం మండల అధ్యక్షులు దొంగల లక్ష్మీనారాయణ ఆయన మాట్లాడుతూ ఈ సమస్యపై ప్రభుత్వానికి ప్రజాస్వామ్య పద్ధతిలో బీఆర్ఎస్ పార్టీ మద్దతుతో సర్పంచుల సంఘం ఈ రోజు అసెంబ్లీ ముట్టడి చేపట్టగా, ఎక్కడికక్కడ పార్టీ నాయకులు అరెస్టులు చేయడం ఖండించారు. పాత సర్పంచులను ప్రివెంటివ్ అరెస్టులు చేసి పోలీస్ స్టేషన్లలో నిర్బంధించడం కాంగ్రెస్ ప్రభుత్వ నియంతృత్వ ధోరణిని చాటుతుందన్నారు. వెంటనే పాత సర్పంచుల పెండింగ్ బిల్లులన్నింటినీ విడుదల చేసి సర్పంచుల ఆత్మగౌరవాన్ని కాపాడాలనీ ప్రభుత్వం స్పందించకపోతే ఈ పోరాటాన్ని రాష్ట్రవ్యాప్తంగా మరింత ఉధృతం చేస్తామని బీఆర్ఎస్ పార్టీ హెచ్చరిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు దొంగల లక్ష్మీనారాయణ, శెట్టి సురేష్ నాయుడు, పొట్టా విజయ కిరణ్, బెల్లంకొండ బ్రహ్మం, మండల మాజీ కో ఆప్షన్ షేక్ ఉద్దండు, గుగులోతు మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## మహాలింగేశ్వర గెలిపించావయ్యా.. ఇక అందుకో మా మొక్కు స్వామి

**సర్పంచ్ ఎన్నికల గెలుపుతో మొక్కు తీర్చుకున్న బిఆర్ఎస్ నాయకులు**

**కేశంపేట, విశాలభారతి:** ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికలలో తమ అభ్యర్థి గ్రామ సర్పంచ్ గా, అలాగే తాము వార్డు సభ్యులుగా గెలుపొందడంతో ఆ గ్రామ బిఆర్ఎస్ నాయకులు గ్రామంలోని మహలింగేశ్వర స్వామి ఆలయంలో 111 కొబ్బరికాయలు కొట్టి తమ మొక్కును తీర్చుకున్నారు. మండల పరిధిలోని కాకునూరు గ్రామంలో బిఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థి బుడ్డోల్ల రాజు సర్పంచ్ గా,వార్డు సభ్యులుగా సీమల శ్రీనివాస్, వల్కె శ్రీనివాస్, ఆరె రాఘవేందర్, దన్నే రామకృష్ణ లు గెలుపొందారు. తమ అభ్యర్థి సర్పంచిగా గెలుపొందడంతో గ్రామ వార్డు సభ్యుడు సీమల శ్రీనివాస్ సోమవారం గ్రామంలోని మహాలింగేశ్వర స్వామి ఆలయానికి చేరుకొని స్థానిక బిఆర్ఎస్ నాయకులతో కలిసి 111 కొబ్బరికాయలు కొట్టి తమ మొక్కు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమం లో గ్రామ సర్పంచ్ బుడ్డోల్ల రాజు,వార్డు సభ్యులుగా సీమల శ్రీనివాస్, వల్కె శ్రీనివాస్, ఆరె రాఘవేందర్, దన్నే రామకృష్ణ లతో పాటు స్థానిక బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



# లష్కర్ గూడను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతా

- సర్పంచ్ అల్లె ఐలయ్య యాదవ్
- లష్కర్ గూడలో అట్టహాసంగా నూతన పాలకవర్గం ప్రమాణస్వీకారం
- లస్కర్ గూడ గ్రామపంచాయతీలో బాధ్యతలను చేపట్టిన నూతన పాలకవర్గం
- గ్రామాన్ని అన్ని రంగాల్లో దశలవారీగా అభివృద్ధి చేస్తా: సర్పంచ్




**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :**

అబ్దుల్లాపూర్మెట్ మండలంలో లష్కర్ గూడ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దుతానని నూతన సర్పంచ్ అల్లె ఐలయ్య యాదవ్ స్పష్టం చేశారు. మండల పరిధిలోని లష్కర్ గూడ గ్రామపంచాయతీ నూతన పాలకవర్గం ప్రమాణస్వీకారోత్సవం సోమవారం గ్రామపంచాయతీ ఆవరణలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి మండల ఎంపీడీఓ జగదీష్, ఎంపీవో మధుసూదన చారిలు ప్రత్యేక అధికారులుగా హాజరై సర్పంచ్ అల్లె ఐలయ్య యాదవ్, ఉప సర్పంచ్ కరిమళ రాజు, వార్డు సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు.ఈ సందర్భంగా గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, వైస్ ఛైర్మన్ భాస్కరాచారి, ఎంపీడీఓ శ్రీవాణి, మాజీ జడ్పీటీసీ బింగిదేవాదాస్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరై నూతన పాలక వర్గాన్ని శాలువాలు, పూలమాలలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులను ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా సర్పంచ్ అల్లె ఐలయ్య యాదవ్ మాట్లాడుతూ... తనపై నమ్మకం ఉంచి గెలిపించిన గ్రామ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ గ్రామ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానన్నారు. పార్టీలకు అతీతంగా అందరినీ కలుపుకొని గ్రామాన్ని ప్రగతి పథంలో నడిపిస్తానని తెలిపారు. వార్డుల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి, అధికారుల సమన్వయంతో వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. సమిష్టి భాగస్వామ్యంతో లష్కర్ గూడను జిల్లాలోనే ఉత్తమ ఆదర్శ గ్రామపంచాయతీగా నిలబెడతానని ధీమా వ్యక్తం చేశారు. తనకు ఓటు వేసి గెలిపించిన ప్రజలకు, సహకరించిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శివ ప్రసాద్, అబ్దుల్లాపూర్మెట్ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ప్రభాకర్ గౌడ్, అబ్దుల్లాపూర్ గ్రామ సర్పంచ్ మందుల విజయ శ్రీశైలం గౌడ్ తో పాటు పలువురు నాయకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మూగజీవాల రక్షణతో ఉపాధికి బాసట

**నిర్దవెల్లి గ్రామ సర్పంచ్ చెదురువెల్లి భాస్కర్ గౌడ్**



**కేశంపేట, విశాలభారతి:** వ్యవసాయం తర్వాత రైతులు ఎక్కువగా ఆధారపడుతున్నది పశుపోషణ పైనేయని వాటి సంరక్షణతో ఉపాధికి బాసట లభిస్తుందని నిర్దవెల్లి గ్రామ సర్పంచ్ భాస్కర్ గౌడ్ అన్నారు. నిర్దవెల్లి గ్రామంలో 1468 గొర్రెలకు , 70మేకలకు పశు వైద్యాధికారులు నట్టల నివారణ మందులు వేశారు. సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పశు సంపదను కాపాడడంలో వాటి సంరక్షణ కోసం వేసే టీకాలు, మందులు తప్పనిసరిగా వేయించాలన్నారు. గ్రామానికి వచ్చి పశు వైద్య సిబ్బంది వేస్తున్న టీకాలను రైతులు తప్పనిసరిగా వేయించడం ద్వారా సద్వినియోగపరచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ రాజీవ్ పైలెట్ ,వార్డ్ మెంబర్ రమేష్, రొయ్యల మంజులజంగేష్, గ్రామ కమిటీ అధ్యక్షుడు కొత్త శ్రీశైలం,ఉపాధ్యక్షులు కాజా పాషా, నాయకులు బడక మల్లయ్య,దిద్దెల ముత్యాలు, దిద్దెల జంగయ్య, ఆకుల రామకృష్ణ, ఎండి మక్షుద్, మద్దెల శేఖర్,దయ్యాల శ్రీశైలం, దయ్యాల శంకరయ్య, గౌరిగే రోశయ్య, శీను, గుత్తి మల్లేష్, వెంకటేష్, కొత్త వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి సమస్యలను వెంటనే పరిష్కరించాలి

**రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి**



**రంగారెడ్డి, విశాలభారతి:** ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణిలో అందిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి (40) ఫిర్యాదులు అందాయి.వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ కు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలని,పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.రెవెన్యూ శాఖకు సంబంధించి 21, ఇతర శాఖలకు సంబంధించి19, మొత్తం 40 దరఖస్తులు అందాయి.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో యూరియా కొరత లేదు

**జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి**



**రంగారెడ్డి, విశాలభారతి:** జిల్లా వ్యాప్తంగా ఎక్కడ యూరియా కొరత లేదని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని జిల్లావ్యాప్తంగా యూరియా సరఫరా పూర్తిస్థాయిలో కొనసాగుతోందని, ప్రభుత్వ ఆధ్వర్యంలో పనిచేస్తున్న అన్ని యూరియా పంపిణీ కేంద్రాలకు అవసరమైనంత స్టాక్ అందుబాటులో ఉందని పేర్కొన్నారు.విక్రయ కేంద్రాల వద్ద రైతులకు స్పష్టంగా కనిపించే విధంగా స్టాక్ బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. యూరియా సరఫరా తగినంతగా ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని, ఎక్కడా అంతరాయం లేకుండా స్టాక్‌ను అందుబాటులో ఉంచాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.యూరియా పంపిణీలో ఎలాంటి అవకతవకలు జరగకుండా పర్యవేక్షణ మరింత కట్టుదిట్టంగా చేపడతామని తెలిపారు.

## ఆపన్న హస్తం కోసం ఎదురుచూపు!

- రోడ్డున పడిన నిరుపేద గిరిజన కుటుంబం
- మానవత్వం చాటిన జర్నలిస్టు బేతమళ్ళ సహదేవ్
- కాంగ్రెస్ సీనియర్ నేత వాగ్యానాయక్
- ఆర్థిక సహాయం చేసి ఆదుకోండి : బాధితులు భూక్య సాయి



**మహబూబాబాద్, విశాలభారతి:**

మహబూబాబాద్ జిల్లా కురవి మండలం చీమ్లా తండాలో విషాద ఘటన చోటుచేసుకుంది. తండాకు చెందిన నిరుపేద గిరిజన కుటుంబం—భూక్య మంజుల, ఆమె భర్త భూక్య సాయి వారి ఇద్దరు కుమారులు నివసిస్తున్న గుడిసె రాత్రి సమయంలో అగ్నిప్రమాదానికి గురై పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనలో ఇంట్లో ఉన్న బియ్యం, వంట సామగ్రి, దుస్తులు, మంచాలు, దుప్పట్లు, రోజువారీగా కూలీ పనిచేసి పోగుచేసుకున్న రూ. 60 వేలు నగదు, పూర్తిగా కాలిపోయాయి. ఒక్కసారిగా ఆశ్రయం కోల్పోయిన కుటుంబం వీధిన పడటంతో దిక్కుతోచని స్థితిలో రోదిస్తోంది. ఈ విషాదాన్ని న్యూస్ కవరేజ్ కోసం అక్కడికి వెళ్లిన తీయుడబ్ల్యూజె (ఐజెయు) దాడుల నియంత్రణ కమిటీ కో-కన్వీనర్, సీనియర్ జర్నలిస్ట్ బేతమళ్ళ సహదేవ్ ప్రత్యక్షంగా చూసి చలించిపోయారు. మానవత్వంతో ముందుకు వచ్చి బాధిత కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయం అందజేశారు. ఆయన సహకారంతో ప్రేరణ పొందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వాగ్యానాయక్ కూడా బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందించి ఆదుకున్నారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ, తమకు తలదాచుకునే స్థలం గూడు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, దాతలు ముందుకు వచ్చి సహాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. కనీసం తాత్కాలిక నివాసం, నిత్యావసర వస్తువులు, ఆర్థిక సహకారం అందించాలని కోరారు. రోడ్డున పడిన గిరిజన కుటుంబానికి అండగా నిలిచిన జర్నలిస్ట్ బేతమళ్ళ సహదేవ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వాగ్యానాయక్‌ల మానవీయ స్పందనపై స్థానికులు ప్రశంసలు కురిపిస్తున్నారు. ప్రజలు, పెద్దలు, యువకులు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి మరింత సహాయం అందించాలని కోరుతున్నారు.

## వైకుంఠ ఏకాదశి మహోత్సవానికి భక్తులకు ఆహ్వానం

**గౌరెల్లి శ్రీ స్వయంభు స్వర్ణగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక దర్శనం**



**విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్:** వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ఈ నెల 3012 2025 (మంగళవారం) న గౌరెల్లి గ్రామంలో ఉత్తర ముఖంగా వెలసిన శ్రీ శ్రీ శ్రీ స్వయంభు స్వర్ణగిరి లక్ష్మీ నరసింహస్వామి దేవాలయంలో వైకుంఠ ద్వార దర్శనంతో కూడిన ప్రత్యేక స్వామివారి దర్శనం ఏర్పాటు చేసినట్లు దేవాలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ రోజున స్వామివారిని దర్శించుకోవడం వల్ల సాక్షాత్తు శ్రీ నరసింహస్వామి వారినే దర్శించుకున్న అనుభూతి కలుగుతుందని శాస్త్రోక్తంగా పేర్కొన్నారు. కావున యావత్ భక్త బంధువులు ఈ పర్వదినాన స్వామివారిని దర్శించుకొని తీర్థ-ప్రసాదాలు స్వీకరించి స్వామి వారి అనుగ్రహం పొందాలని ఆలయ కమిటీ విజ్ఞప్తి చేసింది.ఈ మహోత్సవంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, గ్రామ ప్రజలు, యువజన సంఘాల నాయకులు, మహిళా సంఘాల నాయకురాళ్లు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు నెల్లూరి రాజు - ఛైర్మన్,చెంచల శ్రీనివాస్ - వైస్ ఛైర్మన్,గ్యార దివ్య దాస్ - డైరెక్టర్,నిరుడు రాజు - డైరెక్టర్,చెట్టుగారి రాజేష్ - డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీధర్ ప్లాజ నటరాజ్ రెసిడెన్సికి నూతన కార్యవర్గం ఎన్నిక

**అధ్యక్షులు ఎం, వి, ఎస్ అయ్యంగారు, కార్యదర్శి యన్ మురళీకృష్ణ**




**ముషీరాబాద్, విశాలభారతి:** నల్లకుంట లోని శ్రీధర్ ప్లాజా నటరాజ్ రెసిడెన్సీలో నూతన కార్యవర్గ సమావేశం జరిగింది. ప్రస్తుత అధ్యక్షులు కార్యదర్శి కె.వి. తిరుమలరావు రామకృష్ణ చంద్రమౌళి ఇద్దరు కలిసి నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు అపార్ట్మెంట్ కు కొత్త అధ్యక్షులు ఎం.వి.ఎస్ అయ్యాంగార్, ఉపాధ్యక్షులు బి రాఘవన్, కార్యదర్శి యన్ మురళీకృష్ణ,జాయింట్ సెక్రెటరీగా శ్రీనివాస్,కోశాధికారి శోభా రాణి,కార్యవర్గ సభ్యులు కోదండరామరావు,ఏ విమల,డి తాతారావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కొత్త కార్యవర్గానికి ఉద్దేశించి కేవీ తిరుమలరావు రామకృష్ణ చంద్రమౌళి మాట్లాడుతూ అపార్ట్మెంట్ అభివృద్ధికి సంక్షేమానికి నూతన పథకాలు రచించి అమలు చేయాలని సూచించారు అపార్ట్మెంట్కు కావాల్సిన సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని వివరించారు. మనమందరం కలిసి మెలిసి పనిచేసుకుంటూ వెళ్దామని సూచించారు.నూతన కార్యవర్గ అధ్యక్ష కార్యదర్శులు కలిసి పాత అధ్యక్ష కార్యదర్శులను అపార్ట్మెంట్కు ఎన్నో సేవలు చేసి అభివృద్ధి పథంలో నడిపించినందుకు కె.వి తిరుమలరావు,రామకృష్ణ చంద్రమౌళికి, రాధా, విజయ్ రామ్ కు ఘనంగా శాలువతో మెమొంటో,పూలతో ఘనంగా సత్కరించారు.ఈ సమావేశంలో నూతన కార్యవర్గ అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ మాపై నమ్మకంతో ఇంతటి బాధ్యతలు అప్పగించినందుకు ప్రతి ఒక్కరికి పేరుపేరునా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## కొత్త డివిజన్ల ఏర్పాటులో గందరగోళం



- బిఆర్ఎస్ పార్టీ విమర్శలు
- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే ఉన్నారా? లేరా? – చైర్మన్ బలరాం ప్రశ్న

**విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్ :**

కొత్తగా ఏర్పాటు చేసిన పెద్ద అంబర్‌పేట్, కుంట్లూరు డివిజన్ల విభజనపై బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పెద్ద అంబర్‌పేట్, కుంట్లూరు డివిజన్ల ఏర్పాటుపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. సమావేశాన్ని ఉద్దేశించి మాజీ మున్సిపల్ చైర్మన్ ఈదమ్మల్ల బలరాం మాట్లాడుతూ..ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో అసలు ఎమ్మెల్యే ఉన్నారా... లేరా...? అనే సందేహం ప్రజల్లో నెలకొంది అని విమర్శించారు. పెద్ద అంబర్‌పేట్, కుంట్లూరు డివిజన్ల ఏర్పాటు పూర్తిగా గందరగోళంగా జరిగిందని అన్నారు.వ్యవసాయం ఆధారంగా జీవించే నాలుగు గ్రామాలను పెద్ద అంబర్‌పేట్ మున్సిపాలిటీలో కలిపి, ఇప్పుడు దానిని జీహెచ్ఎంసీ పరిధిలో చేర్చడం వల్ల ఆయా గ్రామాల ప్రజలపై తీవ్రమైన పన్నుల భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో ప్రజలు అయోమయ స్థితిలో ఉన్నారని తెలిపారు. ఎల్బీనగర్ జోన్ పరిధిలో ఉన్న పెద్ద అంబర్‌పేట్, కుంట్లూరు డివిజన్లను నాగోల్ సర్కిల్‌లో కాకుండా, పక్కనే ఉన్న హయత్‌నగర్ సర్కిల్‌లో కలపాలని డిమాండ్ చేశారు. అలాగే ఓటర్ల వ్యత్యాసం విషయమై పెద్ద అంబర్‌పేట్ డివిజన్‌లో 55 వేల పైచిలుకు, కుంట్లూరు డివిజన్‌లో 12 వేల పైచిలుకు ఓటర్ల వ్యత్యాసం ఉందని వివరించారు. కుంట్లూరుకు సరైన రెవెన్యూ లేకపోయినా ఒక డివిజన్‌గా ఏర్పాటు చేయడం సరికాదని, కుంట్లూరు-తట్టి అన్నారం కలిపి ఒక డివిజన్‌గా చేయాలని సూచించారు. ఈ అంశాలపై కమిషనర్‌కు వినతి పత్రం కూడా అందజేశామని తెలిపారు. రంగారెడ్డి జిల్లాలో సీనియర్ శాసనసభ్యుడినని చెప్పుకునే ఎమ్మెల్యేకు ఈ మేర అవగాహన కూడా లేదా? అంటూ ప్రశ్నించారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గ పరిధిలో నూతనంగా ఏర్పడుతున్న అన్ని డివిజన్లలో ఉన్న లోపాలను సరిదిద్దుతూ, సమానంగా డివిజన్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై స్థానిక ఎమ్మెల్యే పునరాలోచన చేసి వెంటనే చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో కోర్టును ఆశ్రయించి న్యాయపరంగా తేల్చుకుంటామని బిఆర్ఎస్ పార్టీ హెచ్చరించింది.ఈ కార్యక్రమం లో ఇబ్రహీంపట్నం నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు రాంరెడ్డి , మాజీ సర్పంచ్ కళ్లెం ప్రభాకర్ రెడ్డి, తాజా మాజీ కౌన్సిలర్లు అర్చన దామోదర్, మండల కోటేశ్వర్ రావు, తొండెపు రోహిణి బ్రహ్మానంద రెడ్డి, మాజీ కౌన్సిలర్లు దేసారం బాలకృష్ణ గౌడ్, పిల్లి నగేష్ యాదవ్, భాస్కర్ గౌడ్, మైనారిటీ ప్రెసిడెంట్ ఇర్ఫాన్, సీనియర్ నాయకులు జోర్క రాము, గాదె శేఖర్, పత్తి రవికాంత్, ఊటుకూరి కర్నాకర్, గాయాల రాము, పండుగుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ విస్తృతస్థాయి సమావేశం విజయవంతం

**స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపొందిన యువజన నాయకులకు అభినందనలు**



**విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** రంగారెడ్డి జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు నాగేందర్ రెడ్డి, జిల్లా యువజన కాంగ్రెస్ ఇంచార్జ్ సంతోష్ గౌడ్ ఆధ్వర్యంలో ఎల్.బి.నగర్ నియోజకవర్గం ఎస్.కె. గార్డెన్స్‌లో జిల్లా యువజన కాంగ్రెస్ విస్తృతస్థాయి సమావేశం సోమవారం రోజు ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర యువజన కాంగ్రెస్ కో-ఇంచార్జ్ భవ్య, రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డి హాజరయ్యారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో జిల్లా యువజన కాంగ్రెస్ తరఫున గ్రామ సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులుగా గెలుపొందిన యువజన నాయకులను ఈ సందర్భంగా ఘనంగా అభినందించారు. ఈ సమావేశంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డి మాట్లాడుతూ.. దేశంలో బీజేపీ ఎన్నికల కమిషన్ కలిసి నిర్వహిస్తున్న ఓటు చోరీ అంశాన్ని వివరించారు. అలాగే విత్ ఐవైసీ యాప్ వినియోగం, స్థానిక సంస్థల ఎన్నికల్లో యువజన కాంగ్రెస్ పాత్ర, ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరంపై యువజన కాంగ్రెస్ నాయకులకు దిశానిర్దేశం చేశారు.యువత శక్తిని సమన్వయం చేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, రాబోయే రోజుల్లో గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు యువజన కాంగ్రెస్ కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మహోన్నత వ్యక్తి వాజ్పేయి

**రాజ్యసభ సభ్యులు డాక్టర్ కే లక్ష్మణ్**

**ముషీరాబాద్, విశాలభారతి:** విలువలతో కూడిన రాజకీయం చేసిన గొప్ప వ్యక్తి అటల్ బిహారీ వాజ్పేయి అని రాజ్యసభ సభ్యులు డాక్టర్ కే లక్ష్మణ్ అన్నారు. ఒక్క ఓటుతో ప్రభుత్వం పడిపోతున్న ఎటువంటి ప్రయత్నాలు చేయకుండా సంకీర్ణ ప్రభుత్వాన్ని నేను నడపలేను ప్రజా అభివృద్ధి చేయలేనని తేల్చి చెప్పి పార్లమెంటు నుండి నేరుగా ప్రజల్లోకి వెళ్లిన గొప్ప వ్యక్తి వాజ్పేయి అని కొనియాడారు.భారతరత్న మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్పేయి శత జయంతి ఉత్సవాల్లో భాగంగా సోమవారం సత్య నగర్ కమిటీ హాల్ లో బిజెపి అడిగ్మెట్ డివిజన్ అధ్యక్షులు పాశం సాయి కృష్ణ యాదవ్ ఆధ్వర్యంలో మహిళలకు ఉచితంగా చీరల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాజ్యసభ సభ్యులు డాక్టర్ కే లక్ష్మణ్ హాజరై మహిళలకు చీరలను పంపిణీ చేసి మాట్లాడారు. కేంద్రంలో బిజెపిని అధికారంలోకి తీసుకొచ్చి ప్రధానిగా వాజ్పేయి అనేక సంస్కరణలు చేపట్టారని తెలిపారు. ప్రపంచ దేశాలకు తెలియకుండా పోక్రాణ్ లో అణు పరీక్షలు విజయవంతంగా చేసి ప్రపంచానికి భారత సత్త చాటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు భరత్ కుమార్, రమేష్ రామ్, శేష సాయి, కౌండిన్య ప్రసాద్, జనార్దన్ రెడ్డి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.




## ప్రతిపక్షాల గొంతు నొక్కడమే ప్రభుత్వం పనిగా పెట్టుకుంది

- అసెంబ్లీ సమావేశాలవేళ అక్రమ అరెస్టులేంటి?
- కొత్తపేట మాజీ సర్పంచ్ కామ్లెకార్ నవీన్ కుమార్



**కేశంపేట, విశాలభారతి:** ప్రతిపక్షాల గొంతు నొక్కడమే పనిగా ఈ ప్రభుత్వం పెట్టుకుందని ,ప్రతిపక్షం గొంతు నొక్కి ప్రభుత్వాన్ని నడపలేరని,కొత్తపేట మాజీ సర్పంచ్ కామ్లెకార్ నవీన్ కుమార్ అన్నారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో ఆయనను సోమవారం పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పెండింగ్ బిల్లులు చెల్లించమంటే కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ అరెస్టులు చేస్తుందని,అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైన ప్రతిసారి తమను అక్రమ అరెస్టు చేయడం సరికాదన్నారు. ప్రభుత్వం వెంటనే మాజీ సర్పంచ్ ల పెండింగ్ బిల్లులు చెల్లించి, రైతులకు ఎరువులు, నిరుద్యోగులకు ఉద్యోగాలు, ఉద్యోగులకు సకాలంలో జీతభత్యాలు, ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు.

## రెండు కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ అధికారులు

**విశాలభారతి, మర్పల్లి:** వికారాబాద్ జిల్లా మధ్య నిషేధ మరియు ఆబ్కారీ అధికారి కె.విజయభాస్కర్ ఆదేశాల మేరకు అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరిండెంట్ ఎస్.శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యం లో ఆదివారం రోజు మోమినపేట్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో (01 )గంజాయి కేసు నమోదు చేసినట్లుగా తెలిపారు. ఎక్సైజ్ శాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. రానున్న నూతన సంవత్సర వేడుకలను దృష్టిలో పెట్టుకొని వికారాబాద్ జిల్లా బోర్డర్ లో డీటీఫ్ వికారాబాద్ టీం తో కలసి మర్పల్లి మండల పరిధిలోని మొగిలిగుండ్ల చౌరస్త దగ్గర రూట్ వాచ్ చేస్తుండగా ఒక వ్యక్తి గ్లామర్ బైక్ పై ఒక బ్యాగ్ పెట్టుకొని బుదేరా చౌరస్తా నుండి మర్పల్లి వైపు వస్తుండగా అ వ్యక్తిని ఆపి బ్యాగ్ ను సోదా చేయగా అందులో ఎండు గంజాయి లభించిందని, సుమారు 2.026 కేజీలు గంజాయి లభించిందని. అట్టి వ్యక్తి ని అదుపులోకి తీసుకొని ఎండు గంజాయి నీ, గ్లామర్ బైక్, మొబైల్ సీజ్ చేయడం జరిగిందని వ్యక్తి వివరాలు పేరు: బుసరెడ్డిపల్లి శివ కుమార్ తండ్రి బసప్ప వయస్సు:33 సంవత్సరాలు, హైదలపూర్ గ్రామం, మునిపల్లి మండల్, సంగారెడ్డి డిస్ట్రిక్ట్ అని తెలిపారు. వ్యక్తి ని విచారించగా తక్కడపల్లి గ్రామం మునిపల్లి మండలం కు చెందిన గొల్ల ఈశ్వరయ్య వ్యక్తి నేను కలిసి గంజాయి సాగు చేసి విక్రయిస్తామని తెలియజేశారన్నారు. పట్టుబడిన వ్యక్తి ని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు, ఈశ్వరయ్య ని తర్వాత అరెస్ట్ చేస్తామని డిస్ట్రిక్ట్ టాస్క్ ఫోర్స్ సీఐ కె.శ్రీనివాస్ తెలిపారు. ఇట్టి దాడుల్లో ఎస్సై బి .ప్రేమ్ కుమార్ రెడ్డి సిబ్బంది విష్ణువర్ధన్ రెడ్డి, శివప్రసాద్,హనుమంతు, రవికిరణ్, మహేందర్, కుమార్ , లు పాల్గొన్నారు. అక్రమంగా గంజాయి ని త్రాగడం, అమ్మడం, కలిగి ఉండటం చట్ట రీత్యా నేరం కావున ఎటువంటి "మాదకద్రవ్యాల" సమాచారం ఉన్న ఎక్సైజ్ శాఖ అధికారులకు అందించినట్లయితే మీ సమాచారాన్ని గోప్యంగా ఉంచి నిందితులను పట్టుకుంటామన్నారు.



# అర్హులైన వారందరికీ అక్రిడిటేషన్ ఇవ్వాలి

- **గ్రేటర్ పరిధిలోని మండలల్లో అక్రిడిటేషన్ల సంఖ్య పెంచాలి**
- **ఐఅండ్ పి ఆర్ కమిషనర్ కు విజ్ఞప్తి చేసిన టి యు డబ్ల్యూ బృందం**



**కూకట్ పల్లి, విశాలభారతి:** గ్రేటర్ హైదరాబాద్ పనిచేస్తున్న జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు వచ్చే విధంగా జీవోలో సవరింపులు చేపట్టాలని కోరుతూ టి యు డబ్ల్యూ జే (ఐజయు) బృందం సమాచార శాఖ కమిషనర్ కు విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సోమవారం సచివాలయం లోని ఐ అండ్ పిఆర్ కార్యాలయంలో ప్రత్యేక కమిషనర్ ప్రియాంకను కలిసి వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా టియు డబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి కే శ్రీకాంత్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజేష్, హెచ్ యు జె అధ్యక్షులు శిగా శంకర్, మేడ్చల్ అధ్యక్షులు గడ్డమీది బాలరాజు, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు సలీం పాషా, మేడ్చల్ కార్యదర్శి వెంకట్ రాం రెడ్డి, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి మేకల సత్యనారాయణలు సమస్యను ఆమెకు వివరించారు. గ్రేటర్ పరిధిలోని అర్బన్ మండలాల లో ప్రధాన పత్రికలలో నలుగురు నుంచి ఐదుగురు జర్నలిస్టులు విధులు నిర్వహిస్తున్నారని ఆమెకు తెలిపారు. నూతన జీవో 252 ద్వారా ఒక పత్రికకు మండలానికి ఒకే అక్రిడిటేషన్ పొందే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. మిగిలిన ముగ్గురు నలుగురికి అక్రిడిటేషన్ అవకాశం కోల్పోయే ప్రమాదం ఉందని తెలిపారు. రూరల్ మండలాలతో కాకుండా అర్బన్ మండలాలను ప్రత్యేకంగా చూడాలని ఆమెకు విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టుల ఆవేదనలు దృష్టిలో ఉంచుకొని జీవోలో సవరణలు చేసి న్యాయం చేయాలని కోరారు.

**సానుకూలంగా స్పందించిన కమిషనర్**

గ్రేటర్ పరిధిలోని మండలాల్లో పనిచేస్తున్న జర్నలిస్టుల సమస్య పై పౌర సంబంధాలు అండ్ సమాచార శాఖ కమిషనర్ ప్రియాంక సానుకూలంగా స్పందించారు. అర్బన్ మండలాలలో పనిచేస్తున్న అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ లు ఇవ్వడం న్యాయబద్ధమైనదని తెలిపారు. త్వరలోనే మంత్రితో చర్చించి తగు నిర్ణయం తీసుకుంటామని హామీని ఇచ్చారు.

## జిల్లాలో తేలిన మున్సిపాలిటీల లెక్కలు



**కామారెడ్డి , విశాలభారతి:** కామారెడ్డి జిల్లాలోని స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి జాబితా విడుదలైంది.కామారెడ్డిలో 49 వార్డుల్లో 1,04,213 మంది ఉన్నారు. ఇందులో SC 9,495, STW 1,236 మంది ఉన్నారు. బాన్సువాడలో 19 వార్డులు ఉండగా 28,384 మంది జనాభా, SCలు 3,026, STలు 791గా నమోదయ్యారు. బిచ్కుందలో 12 వార్డుల్లో 16,081 మంది ఉండగా SCలు 2,116, STలు 620 మంది ఉన్నారు. ఎల్లారెడ్డిలో 12 వార్డుల్లో 19,750 మంది SCలు, 2,249, ST లు 441 మంది ఉన్నారు.

## కూచిపూడిలో గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించిన కామారెడ్డి విద్యార్థులు ప్రణవశ్రీ , సాన్వి



**కామారెడ్డి , విశాలభారతి:** హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో 4,608 మంది కళాకారులు 40 నిమిషాల పాటు కూచిపూడి నృత్యం చేసి గిన్నిస్ రికార్డు నెలకొల్పారు. భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో కూచిపూడి కళావైభవం 2 పేరిట ఈ ప్రదర్శనలు చేపట్టారు.కామారెడ్డి కూచిపూడి కళాక్షేత్రం విద్యార్థులు తెలుగు రాష్ట్రాలతో పాటు విదేశాల నుంచి వచ్చిన కళాకారులు ఉత్సాహంగా నాట్యం చేశారు. ఈ అకాడమీ ఆధ్వర్యంలో 2023లో 4,218 మంది విద్యార్థులతో ఈ ప్రదర్శనలను గిన్నిస్ రికార్డులోకి ఎక్కగా. తాజాగా ఆ రికార్డును ఈ ఏడాది వారే అధిగమించారు. కామారెడ్డి పట్టణానికి చెందిన కూచిపూడి కళాక్షేత్రం నుంచి 30 మంది కళాకారులు ఈ నాట్య ప్రదర్శనలో పాల్గొన్నారు. ప్రముఖ నాట్య కళాకారిణి తార ఆధ్వర్యంలో విద్యార్థులు ప్రణవశ్రీ , మరియు సాన్వి , ఈ పోటీల్లో పాల్గొన్నారు. కామారెడ్డికి గిన్నిస్ బుక్ రికార్డు రావడం హర్షించ దగ్గ విషయం అని తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ మేరకు గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్ ప్రతినిధి స్వప్నిల్ ధ్రువీకరణ పత్రాలను అందజేశారు.

## బైక్ అదుపుతప్పి ఒకరి మృతి



**కథలాపూర్, విశాలభారతి:** జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం తక్కళ్లపల్లి శివారులో బైక్ పై నుండి పడి ఒకరి మృతితక్కళ్లపల్లి కి చెందిన కండ్లి లోకేష్ (23) అనే వ్యక్తి తన మోటార్ సైకిల్ పై తక్కళ్లపల్లి నుండి మోహనరావు పేట్ వైపు తన భార్య శ్వేతా తో పాటు వెళ్తుండగా తక్కళ్లపల్లి శివారులో మలుపు వద్ద తన బైక్ అదుపు తప్పి ప్రక్కన ఉన్న పొలంలో పడగా తల, ఛాతిలో బలమైన గాయాలు తాకడం వలన కోరుట్ల ఆసుపత్రి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. అతని భార్య శ్వేతా ను మెరుగైన చికిత్స కై జగిత్యాల ఆసుపత్రి కి తరలించారు. ఇట్టి సంఘటన పై స్థానిక SI నవీన్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

## పదో తరగతి పరీక్షలు మంచి మార్కులు సాధించాలి

**ప్రజా ట్రస్ట్ చైర్మన్ బోస్లే మోహన్ రావు పటేల్**



**ముధోల్ , విశాలభారతి:** ముధోల్ నియోజకవర్గంలోని సోమవారం మచ్కల్-చించాల ఎడ్ బిడ్ బోరేగావ్‌లో గ్రామాలలో ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు ఎస్ఎస్‌సీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఎస్ఎస్‌సీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ స్థాయి నాయకులు సమన్వయంతో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ముధోల్ మాజీ ఎంపీపీ సుభాష్ జాదవ్ పటేల్ మాట్లాడుతూ... ఎస్ఎస్‌సీ పరీక్షలు విద్యార్థుల భవిష్యత్తుకు కీలకమని తెలిపారు. పూర్తి సన్నద్ధతతో పరీక్షలకు హాజరుకావాలని సూచించారు. ఆత్మవిశ్వాసంతో చదివితే మంచి ఫలితాలు వస్తాయని చెప్పారు. మెటీరియల్ పంపిణీ కార్యక్రమంలో ఆత్మస్వరూప్, గంగాధర్, మేకల గణేష్, సర్వేష్, రాంచంద్రారెడ్డి, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి కి సన్మానం



**పరకాల , విశాలభారతి:** వరంగల్ నల్గొండ ఖమ్మం నియోజకవర్గం టీచర్స్ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డినీ నడికూడ మండలం పి ఆర్ టి యు మండల శాఖ అధ్యక్షులు అచ్చ సుదర్శన్ కుటుంబ సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో హన్మకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి పలిత శ్రీహరి, వరంగల్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఈదునూరి రవీందర్ రెడ్డి, నక్కిరెడ్డి మహేందర్ రెడ్డి, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు మిరియాల సతీష్ రెడ్డి, భూపాల్ పల్లి జిల్లా ఏ ఎం ఓ పింగిలి విజయపాల్ రెడ్డి, వరంగల్ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ గఫార్ మరియు వివిధ మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ చీరల పంపిణీ

**పరకాల , విశాలభారతి:** గీసుగొండ మండల కేంద్రంలో మహిళా సంఘాల భవనం గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థగ్రామీణాభివృద్ధి సంస్థ.కార్యాలయంలో ఇందిరమ్మ చీరల పంపిణీ సర్పంచ్ విరగొని రాజ్ కుమార్ చేయడం జరిగింది. మాట్లాడుతూ మహిళ ఉన్నది తెలంగాణ ప్రగతి పేరిట కార్యక్రమాలు స్వయం సహాయక సంఘాల (ఎస్ హెచ్ జి) సభ్యులకు ప్రతి మహిళకు చీర అందిస్తుంది.దీని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కోట ప్రమోద్, సెర్ప్ సీసీ బొజ్జ సురేశ్, గ్రామ కార్యదర్శి పోలు రాజేంద్రప్రసాద్,వివో ఏలు జ్యోతి,సరస్వతి, హేమలత, భవాని, వివో మహిళా ప్రతినిధులు జ్యోత్స్న, పద్మావతి,మమత ఉమా, గ్రామ బిల్ కలెక్టర్,మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

## కేటీపీఎస్ బూడిద సిండికేట్ పేరుతో బెదిరింపులు



**పోలీసులను ఆశ్రయించిన కాంట్రాక్టర్**

**పాల్వంచ విశాలభారతి:**

సుమారు రెండు నెలల క్రితం తెలంగాణ జెన్‌కో పరిధిలో జరిగిన బూడిద (పాండ్ యాష్) టెండర్లలో భాగంగా, పాల్వంచ కేటీపీఎస్ 5, 6 స్టేజ్‌లు, 7వ స్టేజ్‌కు సంబంధించిన పాండ్ యాష్ తరలింపు పనులను పొందిన కాంట్రాక్టర్ ని వేదిరింపులు గురి చేస్తున్నారని బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. ఈమేరకు పాల్వంచ సిఐ కి ఫిర్యాదు చేసారు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాలు... పాల్వంచ మండలం పుల్లాయిగూడెం గ్రామానికి చెందిన చర్ప అశోక్ వృత్తిరీత్యా అనిత ట్రైబల్ లేబర్ కాంట్రాక్టర్ అనే ఫర్మ్ పేరుతో కాంట్రాక్టర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. 5, 6 స్టేజ్‌లకు సంబంధించిన బూడిద తరలింపుకు సుమారు 100 మంది కాంట్రాక్టర్లకు అనుమతులు ఇవ్వబడినవి. వారు గత రెండు నెలలుగా ఆయా స్టేజ్‌ల పాండ్ యాష్ చెరువుల నుండి బూడిదను తరలిస్తున్నారు. బాధితుడు మాత్రం 7వ స్టేజ్‌కు సంబంధించిన పాండ్ యాష్ మాత్రమే తరలిస్తున్నారు. గత ఒక వారం రోజులుగా 5 & 6 స్టేజ్‌లకు సంబంధించిన కొంతమంది కాంట్రాక్టర్లు కలిసి ఒక సిండికేట్‌గా ఏర్పడి, తనను కూడా వారి సిండికేట్‌లో చేరాలని ఒత్తిడి చేస్తున్నారు. తాను ఇప్పటికే కొంతమంది ఇటుక బట్టీల యజమానులతో బూడిద సరఫరా విషయమై ఒప్పందాలు చేసుకున్నానని, తాను సిండికేట్‌లో చేరడం కుదరదని స్పష్టంగా తెలియజేశాను. అంతేకాక, నేను సరఫరా చేస్తున్న బూడిద 7వ స్టేజ్‌కు సంబంధించినదని, వారి సిండికేట్ 5 & 6 స్టేజ్‌లకు మాత్రమే సంబంధించినదని కూడా వివరించాను. అయితే సిండికేట్‌కు చెందిన వ్యక్తులు నన్ను తీవ్రంగా బెదిరిస్తున్నారు. నా వద్దకు బూడిద కొనుగోలు చేయడానికి వచ్చిన లారీలను అడ్డగిస్తూ, లారీ అద్దాలుపగలగొడతాం", అవసరమైతే లారీని తగలబెడతాం", మా మాట వినకపోతే నిన్ను చంపుతాం"అని బెదిరిస్తున్నారు. తాను సిండికేట్‌లో చేరకపోతే తన తండ్రి చర్ప చిన్న రాములు (ప్రస్తుతం కేటీపీఎస్ లో ఆర్టిజన్‌గా పనిచేస్తున్నారు) వారికి ట్రాన్స్‌ఫర్ చేయిస్తామని కూడా బెదిరిస్తున్నారు. తనను, తన కుటుంబ సభ్యులను బెదిరిస్తున్న సిండికేట్‌కు చెందిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకొని, తనకు, తన వ్యాపారానికి పూర్తి రక్షణ కల్పించాలని కోరారు.

## ఫుట్ పాతుల ఆక్రమణ



- **పెరుగుతున్న పార్కింగ్ సమస్యలు**
- **వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు**
- **పది అడుగులకు పైగా ప్రభుత్వ భూమి ఆక్రమణ**

**భద్రాచలం, విశాలభారతి:**

భద్రాచలం పట్టణంలో ప్రతి చోట పది అడుగులకు పైగా ప్రభుత్వ భూమిని ఆక్రమించి వాటిపైన వ్యాపారస్తులు వ్యాపార ప్రకటన బోర్డులను ఏర్పాటు చేస్తున్నారు పది అడుగులకు పైగా రోడ్లను ఆక్రమించి డ్రైన్ అలాగే ఫుట్ పాతులను కూడా ఆక్రమించిగా వ్యాపారాలను కొనసాగిస్తున్నారు రోడ్లమీద వాహనాలు నిలిపేందుకు వాహనదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి కనిపిస్తుంది రోడ్లమీద వాహనాలు నిలుపుదల చేయటం వలన ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుంది ఎవరికి వారు ఇష్టాను సారంగా ప్రభుత్వ భూమిని ఆక్రమించి వారి వ్యాపారాలను కొనసాగిస్తున్నారు వ్యాపార ప్రకటనల బోర్డులను కూడా రోడ్ల మీదే ఏర్పాటు చేయడం వలన అనేక ఇబ్బందులు ఏర్పడుతున్నాయి ఫుట్పాతులను ఆక్రమించి బడ్డీలను పెట్టడం రోడ్డు ఇరుకుగా అవడం వలన అనేక సమస్యలు తలెత్తుతున్నాయి ఫుట్పాత్తుల స్థలాలను ఆక్రమించి వాటిని కూడా వేరే వాళ్లకు వేళల్లో కిరాయిలకు ఇవ్వటం వారి రిజిస్ట్రేషన్ స్థలం లా వ్యవహరించడం జరుగుతుంది తక్షణమే అధికారులు వీటిపైన సమగ్ర సర్వే నిర్వహించి రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి రోడ్లపై బోర్లను ఏర్పాటు చేసిన వ్యాపార ప్రకటనలను తక్షణమే తొలగించాలని ప్రజలు కోరుతున్నారు ఫుట్పాతుల స్థలాలను ఆక్రమించి వేరే వాళ్లకు అద్దెలకు ఇచ్చే వాళ్లపైన చర్యలు తీసుకోవాలని అలాగే ఫుట్పాతులపై వ్యాపారాలు తొలగించి వాహనదారులకు బాటసారులకు నడిచేందుకు వాహనాలు నడిపేందుకు ఇబ్బందిగా మారిన ఆక్రములను తొలగించి రోడ్ల రవాణా వ్యవస్థను కాపాడాలని ప్రజలు విన్నవిస్తున్నారు ఫుట్పాతుల స్థలాలను ప్రభుత్వ అధికారులు కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

## కమిషనర్‌కు వినతిపత్రం అందజేసిన బీజేపీ నేతలు



**పరకాల, విశాలభారతి:** పరకాల పట్టణంలో నెలకొన్న పలు పలు సమస్యల పరిష్కారానికి భారతీయ జనతా పార్టీ పరకాల పట్టణ శాఖ నాయకులు మున్సిపల్ కమిషనర్ కు వినతి పత్రం సమ ర్పించారు. బిజెపి పట్టణ శాఖ అధ్యక్షులు గాజుల నిరంజన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. డివైడర్ విస్తరణ పనులు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చేపట్టాలని, బస్టాండ్ జంక్షన్ అభివృద్ధిలో చిరు వ్యాపారులకు న్యాయం చేయాలని, పనిచేయని రోడ్డు క్లీనింగ్ మెషీన్ను వెంటనే వినియోగంలోకి తేవాలని కోరారు. అలాగే పాత పోస్టుమార్టం రోడ్డులో అపరిశుభ్రత సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి సంగా పురుషోత్తం, నాయకులు మార్త రాజభద్రయ్య, ధర్నా నారాయణ దాసు, కుక్కల విజయ్ కుమార్, ఆకుల రాంబాబు బిజెపి నాయకులు, బూత్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి క్రికెట్ టీంకి ఎంపిక



**పాల్వంచ విశాల భారతి:** కాకతీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ పోటీల్లో ప్రభుత్వ డిగ్రీ అటానమస్ కళాశాల, పాల్వంచ విద్యార్థులు ప్రతిభావంతమైన ఆటతీరుతో విశేషంగా రాణించారు. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ఎస్సార్ అండ్ బీజీఎస్ఆర్ జట్టు విజేతగా నిలవగా, ప్రభుత్వ డిగ్రీ అటానమస్ కళాశాల, పాల్వంచ జట్టు ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకుంది.ఈ టోర్నమెంట్‌లో కళాశాల తరపున పాల్గొన్న నలుగురు విద్యార్థులు ..ఎం. సూర్య, జె. సంపత్, ఎస్. ప్రవీణ్ మరియు జి. కళ్యాణ్ తమ అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకొని కాకతీయ విశ్వవిద్యాలయ క్రికెట్ టీంకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ పోలారపు పద్మ మరియు ఇన్చార్జి పీడీ పొట్లపు శ్రీనివాసరావుతెలిపారు.ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు అభినందిస్తూ, భవిష్యత్తులో జాతీయ స్థాయిలో కూడా మంచి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల క్రీడా ప్రతిభను ప్రోత్సహించడంలో కళాశాల ఎల్లప్పుడూ ముందుంటుందని వారు పేర్కొన్నారు.

## బీసీలకు దామాషా పద్ధతిలో సీట్లు కేటాయించాలి

**టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు వినతి పత్రం అందించిన బేరి రామచంద్ర యాదవ్**



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** రాబోయే ఎన్నికల్లో బీసీలకు దామాషా పద్ధతిలో వాటా కల్పిస్తూ, బీసీలకే బీసీ సీట్లు కేటాయించాలని బీసీ నేత, బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బేరి రామచంద్ర యాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్‌కు ఆయన వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా బేరి రామచంద్ర యాదవ్ మాట్లాడుతూ..రాబోయే ఎంపీటీసీ, జడ్పీటీసీ, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, చైర్మన్ల ఎన్నికల్లో గ్రామీణ, పట్టణ స్థాయిలో బీసీలకు దామాషా ప్రకారం సీట్లు కేటాయించాలని కోరారు.జనాభా పరంగా ఎక్కువ సంఖ్యలో ఉన్న బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించేందుకు ప్రభుత్వం స్పష్టమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.వినతి పత్రాన్ని స్వీకరించిన టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. బీసీల వాటా కోసం కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని తెలిపారు.రాబోయే ఎన్నికల్లో బీసీలకే సీట్లు వచ్చేలా పార్టీ పరంగా చర్యలు తీసుకుంటామని, ఈ అంశాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి కూడా తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా హామీపై సంతోషం వ్యక్తం చేసిన బేరి రామచంద్ర యాదవ్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఉస్మానియా విశ్వవిద్యాలయ విద్యార్థి సంఘం నాయకులు నిరంజన్ యాదవ్, సందీప్ యాదవ్, కృష్ణ గౌడ్, రమేష్ ముదిరాజ్, పద్మశాలి సంఘం నాయకుడు అశోక్, నాయి బ్రాహ్మణ సంఘం సాయిలు, రజక సంఘం కిషోర్, లెనిన్ యాదవ్, శశాంక్ యాదవ్, క్రాంతి కుమార్, సంతోష్ కుమార్, సంపత్ కుమార్ యాదవ్‌తో పాటు వివిధ యాదవ సంఘాలు, బీసీ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా విశ్వాసాన్ని చూరగొనాలి. సిపిఎం



**వికారాబాద్ , విశాలభారతి:** గ్రామాలలో నూతనంగా గెలిచిన వార్డు సభ్యులు ప్రజా సమస్యలు పరిష్కరించి ప్రజల విశ్వాసాన్ని చూరగొనాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఆర్ మహిపాల్ జిల్లా నాయకులు వార్డు సభ్యులకు సన్మానించి సూచించారు. సోమవారం క్లబ్ హాలో వికారాబాద్ నియోజక వర్గంలో నూతనంగా ఎన్నికైన సిపిఎం వార్డ్ ప్రజా ప్రతినిధులకు సన్మానం చేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన గ్రామాల సీపీఎం వార్డు ప్రజా ప్రతినిధులు ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేసి ప్రజల విశ్వాసాన్ని చురగొనాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామాలకు విడుదల చేయాల్సిన నిధుల విషయంలో రాజి లేని పోరాటాలు నిర్వహించి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో అట్టడుగు పేదలను గుర్తించి అందరికీ సమన్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. ఎంతో విశ్వాసంతో ఓట్లు వేసిన ప్రజల నమ్మకాన్ని వొమ్ము చేయకుండా ప్రజల హక్కులను కాపాడడంలో రాజీ లేని ఉద్యమాలు చేయాలని సూచించారు.గెలిచిన ఓడిన ప్రజల మధ్య ఉండి ప్రజలకు అందుబాటులో ఉండి గ్రామాల అభివృద్ధి కోసం పోరాడాలని సూచించారు. భూస్వామ్య భావజాలం, ఆధిపత్య దొరణులతో ప్రజల మధ్య విద్వేష కులం, మతం ప్రాంతం పేర ఎన్ని అడ్డంకులు సృష్టించిన,ప్రజలను సంఘటితం చేసి స్వేచ్ఛయుత ప్రజాస్వామ్యనికి పునాదులు వేసిన చరిత్ర సీపీఎందే అని అన్నారు. ఏకగ్రీవాల పేరుతో ప్రజాస్వామ్యాన్ని ఆపసహ్యం చేస్తున్న తరుణంలో సీపీఎం పోటీలో ఉండటమే కాకుండా, పోటీకి సిద్ధంగా ఉండే వారికి సైతం మద్దతుగా నిలిచామని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలో ప్రధాన బూర్జువా పార్టీలు విచ్చలవిడిగా డబ్బు, మద్యం పంపిణి చేసినా ప్రజలు సీపీఎం ప్రజా సంఘాలు చేస్తున్న పోరాటాలను చూసి ఆదరించారని అన్నారు. జిల్లాలో అధికంగా ఎన్నికైన సర్పంచ్ లు వార్డు సభ్యులలో అధికంగా యువత ఉండటం మంచి పరిణామమని, ప్రజా సమస్యలపై అంకిత భావంతో పనిచేసి ప్రజా అభిమానం చూరగొనాలని సూచించారు. వికారాబాద్ మండల పరిధి ఎర్రవల్లి, జైదు పల్లి, ధరూర్ మండలం పరిధిలోని సోమారం, రుద్రారం మోమిన్ కలాన్ మోమిన్ కలాన్, మోమిన్ కుర్ద్ పరిధిలో వార్డులకు సిపిఎం పార్టీ బలపరిచిన అభ్యర్థులు పోటీ చేయగా 6 వార్డులలో గెలుపొందారని, వీరికి సన్మానం చెయ్యడము జరిగింది. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సుదర్శన్, సతీష్ నవీన్, నాయకులు మహిళ సంగం జిల్లా కార్యదర్శి అనసూయ, sfi జిల్లా కార్యదర్శి మహమ్మద్ అగ్బర్, కేవీప్స్ జిల్లా అధ్యక్షులు రాయల్ నవీన్, జగన్న, యాదయ్య అలెండ్ శ్రీనివాస్ రాజు ప్రభాకర్ రాములు రైతు సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు

## సుదర్శన్ రెడ్డిని కలిసిన టీఎన్జీవోస్ నేతలు

**సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా: సుదర్శన్ రెడ్డి**

**నిజామాబాద్, విశాలభారతి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారులు ప్రొద్దుటూరీ సుదర్శన్ రెడ్డిని సోమవారం హైదరాబాద్‌లో నిజామాబాద్ జిల్లా ఎంప్లాయిస్ జేఏసీ (JAC) మరియు టీఎన్జీవోస్ (TNGOS) నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లి సుదీర్ఘంగా చర్చించారు. ఉద్యోగుల సమస్యలపై సానుకూలంగా స్పందించిన సుదర్శన్ రెడ్డి వాటిని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సమస్యల పట్ల సానుకూల వైఖరి ప్రదర్శించినందుకు టీఎన్జీవోస్ పక్షాన ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా చైర్మన్ మరియు టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు నాశెట్టి సుమన్ కుమార్, జిల్లా కార్యదర్శి నేతికుంట శేఖర్ ఆయనకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో అర్బన్ కార్యదర్శి మారుతి, జిల్లా కార్యవర్గ సభ్యులు స్వామి మరియు ఇతర నాయకులు పాల్గొన్నారు.





# 'టాక్సిక్'లో ఎలిజబెత్

యశ్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న 'టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ - అప్స్' సినిమా ప్రచార కార్యక్రమాలు ఊపందుకుంటున్నాయి. సినిమాలోని పాత్రలు ఒకొక్కటిగా పరిచయం అవుతున్నాయి. గీతూ మోహన్‌దాస్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో హ్యూమా ఖురేషీ ఓ కీలక పాత్ర పోషిస్తున్న సంగతి తెలిసిందే. ఆమె ఎలిజబెత్ అనే పాత్రలో నటిస్తున్నట్టుగా ప్రకటిస్తూ... ఆదివారం ఆ పాత్ర లుక్‌ని విడుదల చేశాయి సినీ వర్గాలు. ఆ పాత్ర గురించి దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ సామాజిక మాధ్యమాల్లో పలు విషయాల్ని వెల్లడించారు. "ఎలిజబెత్ పాత్రలో హ్యూమా వేసే ప్రశ్నలు లోతైన ఆలోచనల్ని రేకెత్తించేలా ఉంటాయి. ఒక విభిన్నమైన, బలమైన వ్యక్తిత్వాన్ని తెరపై ఆవిష్కరిస్తుంది. ఇలాంటి పాత్రకు తగ్గ నటిని ఎంపిక చేయడం నాకు ఎంతో కష్టంగా అనిపించింది. ఎప్పుడైతే హ్యూమా నా ఫ్రేమ్‌లోకి అడుగు పెట్టిందో ఆ క్షణంలోనే ఆమె ప్రత్యేకతని గమనించా" అన్నారు. ఈ సినిమా కోసం ఎవరూ ఊహించని సాహసాన్ని మనం చేస్తున్నామని, కెప్టెన్‌గా నువ్వు చేస్తున్న ఈ పని ఓ మాయాజాలం అనీ, ఇది నెరవేరేలా చేసిన తిరుగులేని శక్తి యశ్‌కు కృతజ్ఞతలు అంటూ దర్శకురాల్ని ఉద్దేశిస్తూ సామాజిక మాధ్యమాల్లో వ్యాఖ్య చేశారు కథానాయిక హ్యూమా ఖురేషీ. వెంకట్ కె.నారాయణ, యశ్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం మార్చి 19న రానుంది.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.